నవంబర్-2023

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

## విషయసూచిక


| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 06 |
| భయము విడిచి | కె.ఇ. రాజేంద్ర | 08 |
| మనుష్యులు నీడవంటి... | హన్నాకృప డెస్క్ | 09 |
| ప్రభువగు యెహోవాయే నా బలము | | 10 |
| మధ్యకాలము | హన్నాకృప డెస్క్ | 11 |
| మాయని మచ్చ | ఐజక్‌దేవకుమార్ | 12 |
| ప్రేమించే దేవుడు | సాక్ష్యము | 14 |
| దేవుడు - సిరి | హన్నాకృప డెస్క్ | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| నయమాను భార్య | స్త్రీల కొరకు | 20 |
| బహుమానము | చిన్నపిల్లల పేజి | 22 |
| పరిశుద్ధగ్రంథపరిశోధనా పట్టిక-16 | | 24 |



**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

B.A.,B.L.,


**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. **350/-**

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లోపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726


| సీరియల్ నంబరు | |
|---|---|

**బ్యాంకు అకౌంటు వివరాలు :**

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

# సంపాదకీయం....

హన్నాకృప  పాఠకులకు  ప్రభువు  నామమున వందనములు.

ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న సంఘటనలను గమనించినట్లయితే దేవుని రాకడ సూచనలు తేటతెల్ల మవుతున్నాయి. దేశాల మధ్య యుద్ధ వాతావరణం, అనేక దేశాలలో వరదలు భూకంపాలు సంభవించడం, అంటు వ్యాధులు ప్రబలి అనేకమంది చనిపోవడం లాంటివి మనందరికి ఒక హెచ్చరికగా భావించాలి. ఈ మధ్యకాలంలో ఇశ్రాయేలు పాలస్తీనా మధ్య యుద్ధము జరగటము  వలన ప్రపంచ దేశాల మధ్య ఆధిపత్య పోరు ఏర్పడి మిగిలిన దేశాలు ఏదో ఒక దేశానికి మద్ధతుగా నిలబడుతున్నాయి. అదే జరిగితే మూడవ ప్రపంచ యుద్ధం జరగటానికి కూడా అవకాశం ఉంటుంది.

2000 సంవత్సరానికి ఈ యుగ అంతము అని చాలా మంది ప్రవచించారు. కాదు కాదు 2012కి అని కొంతమంది నొక్కివక్కానించారు. సినిమాలు కూడా తీశారు కాని దేవుడు తమ అపారమైన కృపలో రాకడము ఆలస్యం చేస్తూ వున్నాడు. కొందరు ఆలస్యం అని ఎంచుకొన్నట్టు ప్రభువు తమ వాగ్దానం గురించి ఆలస్యం చేయువాడు కాదు. గాని ఎవడును నశియించవలెనని నిశ్చచింపక, అందరు మారుమనస్సు పొంద వలెనని కోరుచూ, మీ యెడల దీర్ఘశాంతముగలవాడై యున్నాడు. 2 పేతురు 3:9. దేవుడు మనల్ని ప్రేమించి, మారుమనస్సు పొందడానికి మనకు ఇచ్చే సమయాన్ని ఈ లోకానుసారమైన విషయాల కోసం దుర్వినియోగము చేసుకోకుండా మారుమనస్సు పొందాలని దేవుడు కోరుకుంటున్నాడు. కాబట్టి దేవుడు ఇచ్చే సమయాన్ని పాఠకులు సద్వినియోగము చేసుకోవాలని హృదయపూర్వకంగా కోరుతున్నాను.

పత్రిక ముద్రించడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొనినదైనప్పటికీ, కేవలం దేవుని మీద ఆధారపడి నడిపిస్తున్నాము. అయినప్పటికీ పాఠకుల భాగస్వామ్యము ఎంతో అవసరం .  కాబట్టి ఈ మా సాహిత్య పరిచర్యలో మీరు సహకరిస్తారని కోరుతున్నాను. దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును.  మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా  మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం మెసేజ్ చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర

**K. Emmanial Rajendra,  SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

# జఫ్నత్పనేహు

(యోసేపు జీవిత చరిత్ర)

- కొడవటికంటి

ప్రేమతోనే చేస్తున్నాడు. ఒక్కరోజైనా అతని పనిని తను గుర్తించినట్లుగా కనిపించలేదు. బహుశా అతను మనుష్యుల మెప్పుకోసం ఏమి చెయ్యట్లేదేమో. తన హృదయానికిష్టమైన రీతిలో తోటను పెంచుతున్నాడు. అయినా అతను శ్లాఘించ వలసినవాడే. అతనిది మంచి హృదయం, కనుకనే తనను చంపదలచిన అన్నలను ప్రేమించి తన తండ్రి దగ్గరకు వెళ్ళటానికి ఇష్టపడలేదు. ఈ సంవత్సరం రోజులలో ఒక్క రోజైనా తను ఈ యవ్వనస్తుని గురించి ఎందుకు ఆలోచించ లేదని తానే ఆశ్చర్యపోయాడు.

ఇంతలో యోసేపు వచ్చి వాకిలి దగ్గర నిలబడి నేలమట్టుకు వంగి నమస్కారం చేశాడు. యోసేపు వేసుకున్న అంగీ అక్కడక్కడా చినిగిపోయి ఉంది. తలవెంట్రుకలు ఉండవలసిన స్థితికంటే ఎక్కువగా పెరిగిపోయి ఉన్నాయి. ఏదో పొరపాటు జరిగింది. యోసేపు ఎందుకు నిర్యక్ష్యపరచ బడినాడు. అతని విషయం ఎవరూ పట్టించుకోలేదా ఈ సంవత్సరం రోజులు?

“యోసేపు!” అని కోపంగా పిలిచాడు పోతీఫరు. యోసేపు తల పైకెత్తి చూశాడు.

“నీ వస్త్రాలెందుకు చినిగివున్నాయి?” అని పెద్దగా అరిచాడు. ఈ లోపల పోతీఫరు భార్య అక్కడకు వచ్చింది. ఆమె వెంబడి ఇద్దరు బానిసలు వచ్చారు. ఆమె వైపు చూచాడు పోతీఫరు.

“యోసేపుకు కావలసినవి చూడటం లేదా?” అని అడిగాడు.

“పోయిన నెలలో రెండు జతల క్రొత్త దుస్తులు కొని పంపించాను” అంది పోతీఫరు భార్య.

“యోసేపు ఆ వస్త్రాలు ఎందుకు ధరించలేదు?” అని అడిగాడు.

యోసేపు కొంతసేపు మౌనంగా ఉండి మరలా వంగి నమస్కారం చేసి...”అయ్యా, నేను చేసే ఈ తోటపనికి ఆ వస్త్రాలు అనువైనవి కావు. అవి పెద్ద ఉద్యోగస్తులు – అంటే గృహనిర్వాహకుడు చనిపోయిన తర్వాత ఎవరు ఆ పని చేస్తున్నారు?” అని అడిగాడు.

“ఎవరూ చెయ్యటం లేదు” అంది.

‘‘అయితే యోసేపు! ఈ రోజు నుండి గృహనిర్వాహకుడివి నీవే. తోట మొదలుకొని అంతఃపురం వరకు నీ ఆధీనం చేస్తున్నాను. రేపటి నుండి ఆ బాధ్యత తీసుకో’’ అంటూ తన మందిరంలోకి వెళ్ళిపోయాడు.

పోతీఫరు భార్య ఆశ్చర్యపోయింది. ఒక్క సంవత్సరం పని చేసినంత మాత్రాన ఒక హెబ్రీయునికి అంత పెద్ద బాధ్యత అప్పగించటం మంచిది కాదేమో అనుకుంటూ... యోసేపును చూసి దగ్గరికి రమ్మని పిలిచింది.

యోసేపు దగ్గరికి వచ్చి నిలుచున్నాడు.

“రేపు ఉదయం నువ్వు లోపలికి వచ్చేటపగిడు నేను నీకు ఇంతకు ముందు పంపిన వస్త్రాలు కూడా ధరించవద్దు. గృహనిర్వాహకుని వస్త్రాలు నీకు పగలు రెండవ జామున అక్షాపు తెచ్చి ఇస్తాడు. ఈ లోపల వెంట్రుకలు క్షౌరము చేసేవాడు వచ్చి సరిపోయినంతలో వెంట్రుకలు సవరిస్తాడు.

ఇకమీదట నీకు గది ఉండదు. గదులు ఉంటాయి. రేపు నీకు నా షండులలో ఒకరు చూపిస్తాడు. పోతీఫరు గృహనిర్వాహకుని ఉద్యోగానికి తగిన విధంగా నీ ఠీవి ఉండాలి” అని చెప్పి వెళ్ళిపోయింది.

యోసేపు ద్వారము నుండి బయటకు వస్తూనే, తన కోసం వేచియున్న అక్షాపు తనకి వంగి నమస్కారం చేస్తుంటే ఆశ్చర్యపోయాడు, సిగ్గుపడ్డాడు. ద్వారపాలకులు కూడా తనకు వంగి నమస్కారం చెయ్యటం చూసినా కన్నులెత్తి వారిని చూసే ధైర్యం తనకు లేకపోయింది. కొంచెం సిగ్గు, కొంచెం భయంగా తన గదిలోకి వచ్చాడు.

అక్షాపు యోసేపు ప్రక్కనే కూర్చొని ‘‘ఈపాటికే ప్రాంగణమంతా ఈ సంగతి తెలిసిపోయింది” అన్నాడు.

"అక్షాపు! నాకెందుకు నమస్కరించావు?" అని అడిగాడు యోసేపు.

"నేను వంగి నమస్కరించింది యోసేపుకు కాదు. పోతీఫరు అను మా యజమానుని గృహనిర్వాహకునికి. ఇది ఈ ఇంటఉన్న ప్రతి బానిసకు సంతోషకరం. ఈ రోజు నుండి పోతీఫరు నీ వలన ఆశీర్వదించబడతాడు" అన్నాడు.

"పోతీఫరు మన యజమానుడు. నా వలన ఆశీర్వ దించబడటమేమిటి?" అన్నాడు.

"అవును యోసేపు, నువ్వు వచ్చి సంవత్సరం. నేను వచ్చి పన్నెండు సంవత్సరాలు. అదేవిధంగా ఇక్కడున్న బానిసలు కాని, పనివారు కాని అందరూ పది సంవత్సరాల లోపు వచ్చిన వారున్నారు. నేను గమనించినదేమిటంటే ఆ విషయం నా హృదయానికి మాత్రమే తెలుస్తుంది. అది కంటికి చూపించలేనిది. నువ్వు ఇక్కడికి వచ్చినప్పటి నుండి ఇక్కడ ఏదో వెలుతురు ప్రవేశిస్తున్నట్లుగా, దైవసన్నిధి ఇక్కడ వెలసినట్లుగా అనిపిస్తుంది. నా మటుకు నేను నీకు ఐగుప్తు భాష మాట్లాడటం, వ్రాయటం నేర్పించేటప్పుడు నీవు గ్రహించిన తీరు, వరవడి చూస్తే నిన్ను ఏదో దైవశక్తి ఆవరించి యున్నది అనిపించేది" అన్నాడు అక్షాపు.

ఆ రాత్రంతా యోసేపు నిద్రపోతున్నట్లు అనిపించినా, నిద్రపోలేదు. 'ప్రభువా! ఎక్కడికి నడిపిస్తున్నావు? పోతీఫరు ఇంటికి గృహనిర్వహకునిగా ఎందుకు చేశావు? ఐగుప్తులో పుట్టి, ఐగుప్తులో పెరిగి, ఐగుప్తు విద్యలలో ఆరితేరిన మహా మహులు కూడా అందుకోలేని ఈ అవకాశం నాకెందుకు ఇప్పించావు? నీ నామమహిమ మార్గాన ఇంతకాలం జీవించాను. చెట్ల మధ్య కనుక నీ మార్గంలో జీవించాను. కానీ ఈ మానవుల మధ్య నీకు ప్రతీకగా జీవించటానికి నాకు సహాయం చెయ్యి' అని ప్రార్థించాడు.

'తన తండ్రికి తను బ్రతికివున్నట్లు కబురు చేద్దామా!' అనుకున్నాడు. కానీ వద్దు అనుకున్నాడు. తను తన విషయం ఆలోచించుకున్నప్పుడు నా దేవుడు నన్ను గురించి ఆలోచి స్తుంటే నేను ఎందుకు నా జీవితాన్ని గురించి ఆలోచించాలి? నాకు అప్పగించిన బాధ్యతను దేవుని దృష్టిలో యథార్థంగా నిర్వహిస్తే, దేవుడు తాను ఏర్పాటు చేసిన సమయంలో, తన ఇష్టానుసారంగా నా తండ్రిని నా యొద్దకు చేరుస్తాడను కున్నాడు. ఈ మాట అనుకున్నపగిదు తన కళ్ళ వెంబడి నీరు కారుతోంది. అయినా ఈ భావన ఎంతో ఉన్నతమైనది. దేవునిలో నుండి వచ్చే, దేవుని ద్వారా వచ్చే ఏ భావన అయినా అది ఆదరణ కలిగించేదే కదా!

ఇప్పటికి చాలాకాలం క్రితమే తన తండ్రిని, తమ్ముడిని గురించిన బాధ మరుగైపోయింది. ఈ ఇల్లు, ఈ బానిసలు, వచ్చేవాళ్ళు, పోయేవాళ్ళు అందరూ తనవాళ్ళే అనుకున్నాడు. కాని ఇకమీదట తను నిర్వహించవలసిన బాధ్యత తన వల్ల ఏమి అవుతుంది? దేవుని వలననే అవుతుంది. దేవుడిచ్చిన పని దేవుడే నెరవేర్చాలి.

ఉదయం ఇంకా తెల్లవారకముందే నిద్రలేచేటప్పటికి ఇద్దరు బానిసలు గది వెలుపల నిల్చుని ఉన్నారు. వారు ఎందుకు ఇక్కడ ఉన్నారు? అన్నట్లుగా చూచాడు. ఇద్దరూ వంగి నమస్కరించారు.

"ఈ రోజు నుండి మేము మీ సేవ కొరకు నియమించ బడ్డాము. మీరు మీ స్వంత పనులు తప్ప ఇక ఏ పని చేయరాదని అమ్మగారి ఆజ్ఞ" అని వినయంగా చెప్పారు. అనగా అమ్మగారు తప్ప అందరు తమకు బద్దులు అని.

వారిని వెంబడించమన్నట్లుగా చేతులు చూపించారు. యోసేపు వారి వెంట బయలుదేరాడు. యోసేపు వెళ్తుంటే ఎదురైన ప్రతి ఒక్కరు వంగి నమస్కారాలు చేస్తున్నారు. ఇప్పటికి ఈ నమస్కారాలు యోసేపుకు అలవాటయ్యాయి. ఆ భవనంలో మొదటి అంతస్తులో దక్షణం తట్టున ఉన్న నాలుగు గదులు తన కొరకు ఏర్పాటు చేసారు. ప్రతి కిటికీకి, ద్వార బంధములకు తెరలు వ్రేలాడదీయబడి ఉన్నాయి. యోసేపు లోపలికి ప్రవేశించగానే ఆ తెరలు విప్పదీయిం చాడు. తాను బ్రహ్మచారి, తనకు ప్రత్యేకత ఏమి లేదు. తెరలు ఉంటే తను బయట ప్రపంచాన్ని బాగా చూడలేను అనుకున్నాడు.

నాలుగు గదులు చక్కగా అలంకరించబడి ఉన్నాయి. ఒకటి చదువు కోవటానికి. నాలుగు ఆసనములు, బల్ల, దీపస్థంభము వేరొకటి పడక గది. మంచాలు, బల్ల, నీళ్ళు, ద్రాక్షారసము. వేరొకటి భోజనాల గది. మరొకటి స్నానాల గది. స్నానాల తొట్టి మొదలగునవి ఉన్నాయి. మంగలి వచ్చినట్లు తెలియచేశారు. లోపలకి వచ్చి స్నానాలగదిలో

తన వెంట్రుకలతో ఒక గంట ప్రయాసపడ్డాడు. తనకు ఇది క్రొత్త అనుభవం. రకరకాలుగా వెంట్రుకలను త్రిప్పి కొంచెం తగ్గించాడు. అద్దంలో చూచుకుంటే ముందు తను కాదు అనుకున్నాడు. తర్వాత ఇంత చక్కగా ఉన్నానా! అనుకున్నాడు. అతను వెళ్ళిపోయిన తరువాత బానిసలు వచ్చి స్నానాల గదిలో స్నానానికి నీళ్ళు తోడిన తరువాత స్నానానికి రమ్మన్నారు. వారిని బయటకు పంపివేసి తనే స్నానంచేసి గదిలోనికి వస్తే అక్కడ నాలుగు జతల దుస్తులు వ్రేలాడదీసి ఉన్నాయి.

తన గుండె కొంచెం ఆగినట్లు అనిపించింది. అన్నీ రంగుల వస్త్రాలే. తన తండ్రి కుట్టించిన రంగుల అంగీ తన యొద్ద నుండి తీసివేయబడిన తర్వాత ఇంతవరకు తను ముతక వస్త్రాలు, రంగు లేనివి మాత్రమే ధరిస్తూ ఉన్నాడు. కానీ ఇప్పుడు వీటిలో ఒక అంగీ, అంతా తన తండ్రి కుట్టించిన విచిత్రమైన పని కలిగిన అంగీ లాగానే ఉంది. తను ఇప్పుడు ఈ సంవత్సరంలోనే చాలా ఎత్తు పెరిగాడు. తను ఎత్తు పెరిగినట్లుగా ఈ వస్త్రాలను చూస్తే అర్ధమవుతుంది. వాటిని ఉపయోగించడానికి వాటిని పరిక్షించవలసి వచ్చింది. ఇవి అన్ని ఐగుప్తు దేశపు నమూనాలే. చాలా ఖరీదైనవి. ఇవి "సింధూనది ఆవలి దేశము నుండి తెప్పించిన వస్త్రములతో తయారు చేయించి నవై యుండాలి" అనుకున్నాడు.

బానిసలు భోజనాల గదిలో అల్పాహారము అమర్చారు. అవన్నీ పోతీఫరు కొరకు తయారు చేయబడినవి. బానిసలకు వేరుగా తయారు చేస్తారు. పనివారి కొరకు వారి జీతముతో తయారు చేయించుకుంటారు. ఇంతకాలం తను బానిస భోజనం చేసాడు. ఇప్పుడు పోతీఫరుగారి భోజనం చూస్తే ఆకలి వేసింది. భోజనం చేస్తున్నంతసేపు బానిసలు ప్రక్కనే నిలబడి ఉన్నారు.

వారిద్దరి వయస్సు సుమారు ముప్పది సంవత్సరాలు ఉండవచ్చు. వారి పేర్లు మెముకాను, మద్యనా. ఇద్దరు ఒకే పోలికగా ఉన్నారు. వీరిని బబులోను నుండి కొని తెచ్చారు. వీరు సౌమ్యులుగా కనిపించారు. వీరు ఇక్కడికి వచ్చి ఎనిమిది నెలలే అయినా పుట్టు బానిసలైనందున యంత్రాల్లాగా కనిపించారు.

ఇప్పుడు తను తన యజమానురాలి వద్దకు వెళ్ళి ఆమె సూచనలు తెలుసుకొన వలసిందిగా తెలిసింది. తనకు ఈ భవనంలో ఉన్న గదుల దారులు సరిగా తెలియవు. ఇవి తెలుసుకోవాలన్నా నాలుగు రోజులు వేరొకరి సహాయం కావలసిందే. తను వస్త్రాలు సరిగా ధరించాడో లేదో అద్దంలో చూసుకున్నాడు. తల మీద కట్టుకున్న వస్త్రము తప్పితే అన్నీ ఐగుప్తు అలంకరణలే. మొదటిసారిగా అధికార హోదాలో తన యజమానురాలిని చూడ వెళ్తున్నాడు. ఆమె కూడా దయ గలదే. ఆమె కళ్ళల్లో తన యెడల దయ మాత్రమే ఇంతవరకు చూడగలిగాడు. ఇక మీదట విధి నిర్వాహణలో ఆమెకు ఇష్టం కాని విధంగా తెలియక ఎప్పుడైనా ప్రవర్తిస్తానేమోనని అనుమానంగా ఉండినది. అనుమానం కలిగినప్పుడు తన మీద తనకే విశ్వాసం సన్నగిల్లుతుంది. దేవుని మీద భారంవేసి తను ఇంతకాలం ఈ లోకంలో అంటే ఈ ప్రత్యేక లోకంలో అందరి మన్నన పొందగలిగాడు.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra

సీరియల్

# నా చిత్తానుసారుడు

13

(దావీదు జీవిత చరిత్ర)

– కొడవటికంటి

"రేపటిదినము అమావాస్య. నేను తప్పక రాజుతో కూడా కూర్చుండి భోజనము చేయవలెను. అయితే ఎల్లుండి సాయంత్రం వరకు చేనిలో దాగుటకు నాకు సెలవిమ్ము ఇంతలో నీ తండ్రి నేను లేక పోవుట కనుగొనగా నీవు ఈ మాట చెప్పవలెను. దావీదు ఇంటివారికి ఏటేటా బలి చెల్లించు మర్యాద కలదు. కాబట్టి అతడు బేత్లెహేమను తన పట్టణమునకు పోవలెనని నన్ను బ్రతిమాలి నా యొద్ద సెలవు పుచ్చుకొనెను అని చెప్పు. అప్పుడు నీ తండ్రి మంచిదని సెలవిచ్చిన యెడల నీ దాసుడనైన నాకు క్షేమమే కలుగును లేక అతడు బహుగా కోపగించిన యెడల అతడు నాకు కీడు చేయ తాత్పర్యం కలిగిన వాడైయున్నాడని నీవు తెసికొని నీ దాసుడనైన నాకు ఒక ఉపకారము చేయవలెను. ఏమనగా యెహోవా పేరట నీతో నిబంధన చేయుటకై నీవు నీ దాసుడననైన నన్ను రప్పించితివి. నాయందు దోషమేమైన ఉండిన యెడల నీ తండ్రి యొద్దకు నన్నెందుకు తోడుకొని పోదువు?" అని యోనాతాను దగ్గరగా వచ్చి అతని ఒర నుండి కత్తి బయటకులాగి యోనాతాను చేతికి ఇచ్చాడు.

యోనాతాను కత్తిని తన ఒరలో పెట్టుకొని దావీదు భుజం మీద ప్రేమతో చెయ్యివేసి "ఆ మాట ఎన్నటికి అనరాదు. నా తండ్రి నీకు కీడు చేయనుద్దేశము కలిగి యున్నాడని నాకు నిశ్చయమైతే నీతో తెలియచెప్పుదును గదా!" అన్నాడు.

"నీ తండ్రి నన్ను గూర్చి కఠినముగా మాట్లాడిన యెడల దానిని నాకు తెలియ చేయువారెవరు?" అన్నాడు.

యోనాతాను దావీదు ఎదురుగా నిలబడి, "ఇశ్రాయేలుకు దేవుడైన యెహోవా సాక్షి. రేపైనను ఎల్లుండి యైనను ఈ వేళప్పుడు నా తండ్రిని శోధింతును అప్పుడు దావీదునకు క్షేమమని నేను తెలిసికొనిన యెడల నేను ఆ వర్తమానము నీకు పంపకపోదునా? అయితే నా తండ్రి నీకు కీడుచేయ నుద్దేశించుచున్నాడని నేను తెలిసికొనిన యెడల దాని నీకు తెలియచేసి నీవు క్షేమంగా వెళ్ళునట్లు నిన్ను పంపివేయని యెడల యెహోవా నాకు గొప్ప అపాయము కలుగజేయునుగాక! యెహోవా నా తండ్రికి తోడుగా ఉండినట్లు నీకునూ తోడుగా ఉండును గాక అయితే నేను బ్రతికియుండిన యెడల నేను చావకుండా యెహోవా దయచూపునట్లుగా నీవు నాకు దయచూపక పోయిన యెడలనేమి, నేను చనిపోయిన యెడల యెహోవా దావీదు శత్రువులను ఒకడైన భూమి మీద నిలువకుండ నిర్మూలము చేసిన తర్వాత, నీవు నా సంతతి వారికి దయచూపక పోయిన యెడలనేమి, యెహోవా నిన్ను విసర్జించునుగాక. ఈలాగున యెహోవా దావీదు యొక్క శత్రువుల చేత దాని విచారించు నట్లుగా యోనాతాను దావీదు సంతతివారినిబట్టి నిబంధన చేసెను.

రేపటి దినము అమావాస్య నీ స్థలము ఖాళీగా కనబడును కదా! నీవు మూడు దినములు ఆగి ఈ పని జరుగుచుండగా నీవు దాగియున్న స్థలమునకు త్వరగా వెళ్ళి ఏసెలు అను బండ దగ్గర గురిచూసి ప్రయోగించినట్లు నేను మూడు బాణములను దాని ప్రక్కకు కొట్టి, నీవు వెళ్ళి బాణములను వెదుకుమని ఒక పనివానితో చెప్పుదును. బాణములు నీకు ఈ తట్టు నున్నవి. పట్టుకొని రమ్ము అని నేను వానితో చెప్పిన యెడల నీవు బయటకు రావచ్చు యెహోవా జీవముతోడు నీకు అపాయమును రాక క్షేమమే కలుగును. అయితే బాణములు నీకు అవతల ఉన్నవని నేను వానితో చెప్పిన యెడల పారిపోమ్మని యెహోవా సెలవిచ్చుచున్నాడని తెలిసికొని నీవు ప్రయాణమై పోవలెను. అయితే మనమిద్దరము మాటలాడిన సంగతి జ్ఞాపకము చేసుకొనుము నీకును నాకును సర్వకాలము యెహోవాయే సాక్షి" అని చెప్పి దావీదును పొలములోనే వదలి యోనాతాను తన ఇంటికి వెళ్ళి పోయాడు.

మరునాడు అమావాస్య. బలులు అర్పించడం పూర్తి అయిన తర్వాత భోజనమునకు ఆహ్వానితులు అందరూ వచ్చి భోజనపు బల్ల దగ్గర కూర్చున్న తర్వాత రాజు వచ్చి మునుపటివలెనే గోడ దగ్గర తన ఆసనం మీద కూర్చున్నాడు. సౌలు ప్రక్కనే కూర్చున్న యోనాతాను అబ్నేరు రావటంచూచి అతనికి తన స్థానమిచ్చి ప్రక్కన కూర్చున్నాడు.

రాజు అందరిని కలయచూచినప్పుడు దావీదు స్థానం ఖాళీగా ఉన్నది. అబ్నేరుతో చిన్నగా "యెష్షయి కుమారుడు ఖచ్చితంగా ఈవేళ అపవిత్రుడైయుండెను" అని చిన్నగా తనలో తాను అనుకున్నట్లుగా గొణిగాడు. కొంచెంఆగి తన చేతిలోని ఈటెను గోడకు ఆనించి "ఔను, అతడు అవశ్యము అపవిత్రుడైయున్నాడు" అన్నాడు.

మరునాడు రాత్రి భోజనమునకు రాజు వచ్చినప్పుడు దావీదు స్థలము ఖాళీగా ఉండటం చూచి యోనాతాను వైపు చూచి "నిన్నను నేడును యెష్షయి కుమారుడు భోజనమునకు రాకపోవుట ఏమి?" అన్నాడు.

యెష్షయి కుమారుడు అని వ్యంగ్యంగా నొక్కి చెప్పటంలోనే యోనాతానుకు దావీదు యెడల రాజుకు కలిగిన ద్వేషం గోచరించింది.

యోనాతాను లేచి నిలుచున్నాడు. అతని హృదయం కోపంతో ఊగిపోయింది. అందువలన కొంచెంసేపు ఆగి తన మనస్సులోని భావనలు ఇంతమందిలో బయట పెట్టడం ఇష్టంలేకపోవటం వలన తండ్రి వైపు చూసి "దావీదు బేత్లెహేమునకు పోవలెనని కోరి "దయచేసి నన్ను పోనిమ్ము పట్టణమందు మా యింటివారు బలి అర్పింపబోవు చున్నారు నీవును రావలెనని నా సహోదరుడు నాకు ఆజ్ఞాపించెను గనుక నీ దృష్టికి నేను దయపొందిన వాడనైతే నేను వెళ్ళి నా సహోదరులను దర్శించునట్లుగా నాకు సెలవిమ్మని బ్రతిమలాడుకొని నా యొద్ద సెలవు తీసుకొనెను. అందు నిమిత్తమే అతడు రాజు భోజనపు బల్ల యొద్దకు రాలేదు" అని తలవంచుకున్నాడు.

"ఆగడగొట్టు దాని కొడుకా" అనిన మాట గర్జించినట్లుగా సౌలు నోట నుండి వెలువడింది.

"నీకును, నీ తల్లి మానమునకును సిగ్గు కలుగునట్లుగా నీవు యెష్షయి కుమారుని స్వీకరించిన సంగతి నాకు తెలిసినది కదా?" అన్నాడు సౌలు.

తన తండ్రినోట ఇంత అసహ్యాకరమైన మాటలు ఇంతకు ముందు ఎన్నడూ వినలేదు. ఇద్దరి మధ్య తన తల్లిని అనటం యోనాతాను కోపంతో ఊగిపోయాడు.

"యెష్షయి కుమారుడు భూమి మీద బ్రతికినంత కాలము నీకైననూ నీ రాజ్యమునకైననూ స్థిరత కలుగదు గదా! కాబట్టి నీవు వర్తమానము పంపి అతనిని నా యొద్దకు రప్పించుము" అని ఆగి "నిజంగా అతడు మరణమునకు అర్హుడు" అన్నాడు సౌలు.

ఇప్పుడు యోనాతాను స్వరం ఎన్నడూ లేనంత ఎత్తైన వేదికకు ఎక్కినట్లుగా "అతడెందుకు మరణ శిక్ష నొందవలెను? అతడేమి చేసెను?" అని నిలదీసినట్లుగా అడిగాడు. బల్లయొద్ద కూర్చున్న వారెవరు యోనాతాను అంత కోపంగా మాట్లాడటం ఇంతకు ముందెన్నడు చూచియుండలేదు. దీని పర్యవసానము ఏమిటి? అని అబ్నేరు చూస్తున్నాడు. సౌలు లేచి నిలుచుని ప్రక్కన ఉన్న ఈటె యెనాతాను మీదకు విసిరాడు అది చంపవలెనన్న ఉద్దేశం కాదుగాని గాయపరచవలెనన్న ఉద్దేశంగా అనిపించింది.

తన ప్రక్కన పడిన ఈటెను చూసాడు. యోనాతాను తండ్రి వైపు అత్యాగ్రహంతో చూచి, మరలా క్రిందపడిన ఈటె వైపు చూచాడు కూర్చున్న వారందరిని చూచి బయటకు వెళ్ళిపోయాడు.

యోనాతాను బయటకు వెళ్ళిపోవటంతో సౌలు నోట మాటరాలేదు. చాలాసేపు ఎవరూ ఏమి మాట్లాడలేదు.

ఆ రాత్రంతా నిద్రపోలేదు. యోనాతాను భార్య అక్సాకి సంగతులు ఎప్పటికప్పుడు తెలుస్తూనే ఉన్నాయి. దావీదును తన భర్త ఎంతగా ప్రేమిస్తున్నాడో తనకు తెలుసు. అయితే ఆయన ఈ రాత్రి రాజు బల్ల యొద్ద భోజనం చేయకుండా వచ్చాడని అర్ధమవుతున్నప్పటికి తన భర్త ముఖం ఇంత రౌద్రంగా, దుఃఖంగా ఉండటం తాను ఇంతకు ముందెన్నడు చూడలేదు. **(సశేషం)**



# భయము విడిచి



'భయమా? నాకా? నెవ్వర్', 'డోంట్ కేర్' అనే మాటలు ఈ లోక సంబంధమైన భయాల విషయాల్లోనే తప్ప దేవునికి భయపడే విషయంలో మాత్రం అనలేరు. ఎందుకంటే దేవునికి భయపడాలి అనే విషయం చాలామందికి తెలియదు. దేవుడంటే భక్తి ప్రదర్శిస్తారు కానీ భయపడరు. చర్చికి వెళ్ళేవాళ్ళంతా తమ భక్తి ప్రదర్శించడానికి తప్ప దేవునికి భయపడి మాత్రం వెళ్ళరు. భక్తిగా వెళ్ళేవాళ్ళు కూడా తక్కువే. అలవాటు ప్రకారం, టైంపాస్‌కి, నిద్రపోడానికి, తమ హంగూ ఆర్భాటం ప్రదర్శించుకోడానికి వెళ్ళేవాళ్ళే ఎక్కువమంది. ఆ భక్తి కూడా చర్చిలో ఉన్నంతసేపే ఉంటుంది తప్ప ఇంటికి వెళ్ళాక ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ అన్యజనుల కంటే ఘోరంగా ఉంటారు. తిట్టుకుంటారు, కొట్టుకుంటారు, టి.వి.లో, యూట్యూబ్‌లో సినిమాలు, సీరియల్స్ చూస్తూ, సెల్‌ఫోన్‌లో గేమ్స్ ఆడుకుంటూ, ఛాటింగ్ చేసుకుంటూ మళ్ళీ ఆదివారం వచ్చేదాకా దేవుడు గుర్తుకు రానంతగా ఈ లోకసంబంధమైన కార్యక్రమాల్లో మునిగి తేలుతూ ఆదివారపు క్రైస్తవులుగా, నామకార్థ క్రైస్తవులుగా ఉంటారు. ఇలాంటి భక్తి ప్రదర్శించే వారు దేవుని శక్తిని గురించి ఆలోచించరు, ఇంకా చెప్పాలంటే అసలు దేవుని గురించే ఆలోచించరు కాబట్టి వారికి దేవుని భయము ఉండదు. పైకి మాత్రమే భక్తి, లోపలంతా కుయుక్తి ఉంటుంది. 'పైకి భక్తిగలవారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారునై యుందురు' (2తిమోతి 3:5) అని ఇలాంటి వారి గురించే చెప్పబడింది. వారి లిస్టు చాలా పెద్దదే ఉంది. ఈ లిస్టులో మనం ఖచ్చితంగా ఉంటాము. అంటే దేవునికి భయపడకుండా పైకి భక్తి నటించేవారికి ఏ గుణాలు ఉంటాయో ఆ లిస్టులోని గుణాలలో ఏదో ఒక గుణము మనకి ఖచ్చితంగా ఉంటుంది. కావాలంటే ఒకసారి చెక్ చేసుకోండి. 'స్వార్థప్రియులు, ధనాపేక్షకులు, బింకములాడువారు, అహంకారులు, దూషకులు, తలిదండ్రులకు అవిధేయులు, కృతజ్ఞతలేనివారు, అపవిత్రులు, అనురాగరహితులు, అతిద్వేషులు, అపవాదకులు, అజితేంద్రియులు, క్రూరులు, సజ్జనద్వేషులు, ద్రోహులు, మూర్ఖులు, గర్వాంధులు, దేవునికంటె సుఖానుభవము నెక్కువగా ప్రేమించువారు' (2తిమోతి 3:2-4). ఒకవేళ మీరు నిజాయితీపరులని మీరు అనుకుంటే పై లిస్టులో ఉన్న గుణాలలో మీకు ఎన్ని ఉన్నాయో ఒక పేపరు మీద రాసుకొని చూడండి మీకే అర్థమవుతుంది మీరు దేవునికి భయపడేవారో కాదో. అయితే 'దేవునికంటె సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించే' గుణము మాత్రము ప్రతిఒక్కరికీ ఉంటుంది. మనం దేవునికి భయపడక పోవడానికి ఈ గుణాలన్నీ కారణమవుతుంటాయి. మనం దేవునికి వ్యతిరేకమైన జీవితం జీవిస్తూ, ఎన్ని పాపాలు చేసినా వెంటవెంటనే శిక్ష రావడం లేదు కాబట్టి భయపడకుండా పాపాలు చేస్తూనే ఉంటాము. 'దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగకపోవుట చూచి మనుష్యులు భయము విడిచి హృదయపూర్వకముగా దుష్క్రియలు చేయుదురు' (ప్రసంగి 8:11) అని చెప్పినట్లు దేవుడంటే భయములేని జీవితం జీవించే వారికి మిన్ను విరిగి మీద పడినట్లుగా హఠాత్తుగా నాశనం వస్తుంది. 'ఎన్నిసార్లు గద్దించినను లోబడనివాడు మరి తిరుగు లేకుండ హఠాత్తుగా నాశనమగును (సామెతలు 29:1). అయినా పర్వాలేదు 'డోంట్ కేర్' అని దేవునికి మనస్సులో చోటివ్వకుండా దేవుడంటే భయము విడిచి ఇష్టానుసారమైన జీవితం జీవించాలనుకుంటే చేయరాని కార్యాలు చేయడానికి దేవుడు మిమ్మల్ని భ్రష్ట మనస్సుకు అప్పగిస్తాడు (రోమా 1:28). 'బెస్ట్ ఆఫ్ లక్'.


ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు

**9 4 4 0 2 1 7 7 2 6**

# మనుష్యులు నీడవంటివారు

మనుష్యులు నీడవంటి వారు. వెలుతురు వుంటేనే నీడ కనబడుతుంది. ఆ వెలుతురు క్రీస్తే 'నేను లోకమునకు వెలుగును' (యోహాను 8:12). ఆ వెలుతురు లేకపోతే మనుష్యుల నీడ కూడా కనబడదు. అయినప్పటికీ నీడవంటి మనుష్యులు తమ జీవితాలను తామే వెలిగించుకోవాలని చూస్తుంటారు. ఈ లోకంలో గొప్పగా వెలిగిపోవాలని చూస్తుంటారు. 'మనము నిన్నటి వారమే, మనకు ఏమియు తెలియదు భూమి మీద మన దినములు నీడవలెనున్నవి' (యోబు 8:8). లోకమునకు వెలుగైన యేసుతో కాకుండా ధనముతో తమ జీవితాలను వెలిగించుకోవటానికి త్వరపడు తుంటారు. వారి తొందరపాటు గాలికే. ధనముతో వెలిగించు కున్న తమ జీవితాలు గాలికి ఆరిపోతాయి. వారు తమ జీవితాన్ని ధారపోసి సంపాదించు కున్న ధనము, ఆస్తి పాస్తులు వారి తదనంతరం ఎవరికి చెందుతాయో వారికే తెలియదు. కుటుంబం మొత్తం ప్రమాదాల్లో చనిపోవడం మనం వార్తాపత్రికలలో, టి.వి. న్యూస్ చూస్తుంటాము. మరి వారు సంపాదించిన ఆస్తిపాస్తులు ఎవరికోసం? ఎంతో కష్టపడి తిని తినక దాచుకున్న డబ్బంతా ఎవరికో చెందుతుంది కదా! చాలామంది వారి బిడ్డల కోసం ఆస్తిపాస్తులు కూడబెడుతూ ఉంటారు. అయితే ఆ బిడ్డలు కూడా వారికి దూరం అయి పోతుంటారు. ఇంకా చెప్పాలంటే బిడ్డలు లేనివాళ్ళు కూడా ధనము సంపాదించాలని ఆరాటపడు తుంటారు. వారు ఎవరి కోసం ధనము కూడబెడుతున్నారో వాళ్ళకే తెలియనంత వ్యసనంగా మారిపోతుంది. ధనమున్న చోట లోకమునకు వెలుగైన దేవుడుండడు కాబట్టి వారి నీడ కూడా వారితో ఉండదు. ఈ లోకంలో మన ఆయుష్కాలం బెత్తెడంతే. 'నా దినముల పరిమాణము నీవు బెత్తెడంతగా చేసియున్నావు. నీ సన్నిధిని నా ఆయుష్కాలము లేనట్లేయున్నది' (కీర్తనలు 39:5). దేవుని దృష్టిలో 1000 సంవత్సరాలు ఒక దినమైతే, మన ఆయుష్కాలమైన 80 సంవత్సరాలు కేవలం రెండుగంటలలోపే ఉంటుంది. ఈ స్వల్పకాలాన్ని మనం ధనసంపాదనకే ఉప యోగిస్తే పరలోకరాజ్యంలో ప్రవేశించ డానికి చేయాల్సిన పనుల సంగతేంటి? దేవుని పని చేయాల్సిన క్రైస్తవులు సైతం ఉద్యోగ, వ్యాపారాల్లో బిజీగా ఉండి దేవుని పని గురించి పట్టించుకోవడం లేదు. 'మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి' (మార్కు 16:15) అని యేసు చెప్పింది మాకు కాదులే అన్నట్లు అన్యజనుల్లా జీవిస్తున్నారు. అన్య జనులతో పోటీపడి మరీ ధనము సంపాదించుకుంటున్న క్రైస్తవులు దేవుని నామానికి అవమానము కలిగిస్తున్నారు. దేవుని తీర్పు దినమున మరి కఠినమైన తీర్పు దేవుడు తన యింటి నుండే మొదలుపెడతాడు. కాబట్టి ఈ లోకంలో మనం జీవించే జీవితం మన నీడను సైతం దూరం చేసే ధనము కోసం కాకుండా వెలుతురు వల్ల వచ్చే నీడను ఇచ్చే యేసు కోసం జీవించి పరలోకరాజ్యంలో ప్రవేశించడానికి అర్హత సంపాదించుకుందాం. 'నీడవలె తమ దినములన్నియు వ్యర్థముగా గడుపుకొను మనుష్యుల బ్రదుకునందు ఏది వారికి క్షేమకరమైనదో యెవరికి తెలియును? వారు పోయిన తరువాత ఏమి సంభవించునో వారితో ఎవరు చెప్పగలరు?' (ప్రసంగి 6:12)


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి...**

**www.onlinetelugubible.net**

# ప్రభువగు యెహోవాయే నాకు బలము

2003వ సంవత్సరము నుండి ఇప్పటి వరకు గత ఇరవై సంవత్సరాలుగా ప్రచురింపబడుతున్న 'హన్నాకృప' పత్రిక ఆవిర్భవించడానికి మూలము 'నిత్యజీవజలము' మాస పత్రిక. 1998వ సంవత్సరం సెప్టెంబరు నెలలో 'నిత్య జీవజలము' మాసపత్రిక ముద్రణకు ప్రభుత్వం వారు అనుమతించారు. అయితే పత్రికను లెటర్ ప్రెస్లో ముద్రించటం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్న పని. కంప్యూటర్ కొనే స్థోమత నాకు లేదు. అప్పట్లో డి.టి.పి. యూనిట్ కొనాలంటే కనీసం రూ. 75,000/- అవసరం అవుతుంది. అది కనీసం నా ఊహకి కూడా అందనిది. అయితే దేవునికి అసాధ్యమైనది ఏమీ లేదనే ధైర్యంతో, విశ్వాసంతో కంప్యూటర్ కొరకైన గదిని, కావలసిన ఫర్నీచరు తయారు చేసి సిద్ధంగా ఉంచు కోవడానికి పూనుకున్నాను.

ఒకరోజు నేను ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్న సమయంలో డి.ఆర్.డి.ఏ అనే ఒక గవర్నమెంటు ఆఫీసు నుండి కొంతమంది ఆఫీసర్స్ నా ప్రింటింగ్ ప్రెస్ దగ్గరకు వచ్చి నన్ను ఒక టెండరులో పాల్గొనమని అడిగాడు. అందుకు నేను అంగీకరించలేదు. ఎందుకంటే నాదొక చిన్న ప్రింటింగ్ ప్రెస్ మిగతా ప్రెస్ వాళ్ళతో పోటీకి వెళ్ళలేను. అందుకే నేనెప్పుడూ టెండర్లలో పాల్గొనలేదు. అయితే వాళ్ళు నన్ను చాలా బలవంతం చేశారు. ఈ టెండర్లకు ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన (పి.యం.ఆర్.వై.) పథకం క్రింద లోను తీసుకొని ప్రెస్ పెట్టిన వారినే పిలుస్తున్నారు. కాబట్టి మీరు తప్పని సరిగా రావాలని చెప్పారు. ఎలాగు ఆ టెండరు నాకు రాదులే అని వెళ్ళాను.

నాతో పాటు ఇంక నాలుగు ప్రెస్‌ల వాళ్ళు ఆ టెండరులో పాల్గొన్నారు. ఆ పని విలువ కేవలం 14,000/- మాత్రమే. ఎలాగూ ఆ వర్కు నాకు రాదని తెలుసు. అయినా వెళ్ళి వాళ్ళ మధ్యలో కూర్చున్నాను. టెండరు ప్రారంభమైన తరువాత ఒక ప్రెస్ అతను పోటీ పడి ఎటువంటి ఆదాయం లేకుండానే ఆ పని తీసుకున్నాడు.

అయితే ఊహించని రీతిలో ఐదు లక్షల రూపాయల వర్కును మా నలుగురికి పంచి పని ప్రారంభించమన్నారు. నాకేం అర్థం కాలేదు. నాకు 1,25,000/- వర్కు వచ్చింది. నాకు తెలుసు నేను ఆ పని చేయలేనని. నాకే కాదు అక్కడ వున్న మిగతా ప్రెస్ల వాళ్ళకి కూడా తెలుసు. ఆ సమయంలో ఏం చేయాలో నాకు అర్థం కాలేదు. దేవుని చిత్తముగా భావించి దేవుని మీద భారం వేశాను. తరువాత ఒక ప్రెస్ అతను నా దగ్గరకు వచ్చి నా వర్కు కూడా అతనే చేస్తాన న్నాడు. అందుకుగాను నాకు కొంత డబ్బు ఇస్తానన్నాడు. సరేనని నేను అతనికి ఇచ్చాను. అతను నాకు 7,000/- ఇచ్చాడు.

తరువాత అదే ఆఫీసు వాళ్ళు వరుసగా నాలుగైదు పనులు ఇచ్చారు. అన్నీ పనులు నా తరపున వేరే వాళ్ళు చేశారు. నేను కేవలం చెక్కులు తీసుకోవడానికి మాత్రమే వెళ్ళాను. ఆ నెలలో నేను ఏ మాత్రం కష్టపడకుండా 25,000/- సంపాదించాను. వాటితో నేనొక చిన్న కంప్యూటర్ కొన్నాను. ఇంకా నాకు ప్రింటరు, తెలుగు సాఫ్ట్‌వేర్ అవసరం వుంది. కంప్యూటర్ ఇచ్చిన దేవుడు అవి కూడా ఇస్తాడనే నమ్మకం వుంది. అప్పటికి నాకు కంప్యూటర్ గురించి ఏమి తెలియదు. అప్పుడు నేను కంప్యూటర్ నేర్చుకోవడం ప్రారంభించాను.

మూడు నెలలకు నేను డి.టి.పి. చేయడం నేర్చుకున్నాను. 1999 ఏప్రిల్ నెలకల్లా నేను అన్నీ నేర్చుకున్నాను. అప్పుడు దేవుడు నాకు 35,000/- ఖరీదు చేసే ప్రింటర్, తెలుగు సాఫ్ట్‌వేర్ ఇచ్చాడు. అప్పుడు అర్థమైంది దేవుడు ముందే నాకు ఇవి ఎందుకు ఇవ్వలేదో. ఒకవేళ నాకు ముందే ఇచ్చినా వాటివల్ల నాకు ఉపయోగం ఉండేది కాదు. ఎందుకంటే నాకు అప్పటికి కంప్యూటర్ గురించి ఏమీ తెలియదు. తరువాత నాకు కంప్యూటర్ పరంగా అవసరమైన వన్నీ, నా మనసులో నేను కోరుకున్నవన్నీ నేను దేవున్ని అడక్కపోయినా నాకు అనుగ్రహించాడు. మరి ముఖ్యంగా డి.టి.పిలోగానీ, కంప్యూటర్‌కి సంబంధించిన అన్నీ విషయాలలో దేవుడు నాకు చాలా జ్ఞానం ఇచ్చాడు.

# మధ్యకాలము

ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర

మధ్యకాలమనగా ప్రవక్త మలాకీ కాలము నుండి ప్రభువైన యేసుక్రీస్తువారి జీవిత ప్రారంభము వరకు వున్న యూదుల సమగ్ర చరిత్ర మరియు పాతనిబంధన క్రొత్త నిబంధన చరిత్రలను కలుపు సమయమిది. మనము ఊహించని కార్యములు, వంఘటనలు జరిగిన చారిత్రాత్మిక సమయమే – ఈ "మధ్యకాలము".

పాతనిబంధన కాలములో ఏ విధముగా చూసినా మలాకీ చివరి ప్రవక్తగా పరిగణింపబడెను. సాధారణ లెక్క ప్రకారం క్రీ.పూ దాదాపు 409 సం॥లో అతడు ప్రవక్తగా నివసించెను. అతనితో సమకాలీనుడైన నెహెమ్యా ఆర్థిక మంత్రులలో చివరివాడైన అతని చివరి సంస్కరణ చట్టము క్రీ?పూ? 409 సం॥లో ప్రిడియక రాజు ద్వారా స్థిరపరచబడెను. ఆ తరువాత 70 సంజల కంటే తక్కువ వయస్సులోనే అతను మరణించెను. అతని కాలములో యూదా ప్రభుత్వము, ఎజ్రా కాలములో అతడు నిర్వహించిన కార్యనిర్వాహణ, పాలన గురించి తెలుసుకొనుటకు ఎజ్రా, నెహెమ్యా, దానియేలు గ్రంధముల వ్యాఖ్యానము ముందుగా చదువవలెను.

కల్దీయుల యొక్క చెర నుండి యూదులు తిరిగి వచ్చి నప్పుడు వారిలో ఎక్కువ మంది క్రొత్త భార్యలను, మిశ్రమ జాతి సంతానమును వారితో తీసికొని వచ్చారు. వారు యెరూషలేములో ఉండుటకు నెహెమ్యా నిరాకరించాడు. గనుక వారు సమరయ ప్రాంతములలో స్థిరపడ్డారు. ఆ విధముగా దేశ బహిష్కరణ చేయబడిన వారిలో ప్రధాన యాజకుడైన యెహెదాయ కుమారుడైన మనష్షే ఒకడు. అతడు సమరయ దేశపు గవర్నర్ అయిన హొరోనీయుడైన సన్బల్లటు కుమార్తెను వివాహమాడి మామగారి భద్రతలో ఉండెను. నెహెమ్యా మరణించిన తరువాత సన్బల్లటు సమరియకు దగ్గరలోనున్న గెరాజీము పర్వతము పై ఒక దేవాలయము కట్టుటకు రాజైన దర్యావేషు నుండి అనుమతి పొంది అతని అల్లుడైన మనష్షేను ప్రధావయాజకునిగా చేశాడు. క్రీ.పూ. 408 సం॥లో ఆలయ నిర్మాణము ప్రారంభించాడు.

ఆలయము నిర్మింపబడిన తర్వాత, తరలి వచ్చిన యూదులందరికి ఆలయము ఆశ్రయపురమైనది. అందు వలన ఆ స్థలంలో పూర్వకాలము నందుండిన మతపరమైన ఆచారాలను త్రోసివేసి, ఇశ్రాయేలు దేవుడైన యెహోవాను మాత్రమే సేవించుటకు పునరుద్ధరింపబడెను. యెరూషలేము ప్రజలు సమరయులను కులభ్రష్టులుగా భావించిరి. సమర యులు. గెరాజీము పర్వతము ఒక్కటి మాత్రమే దేవునిని సరైన స్థలముగా భావించిరి. ఆచారములను త్రోసివేసి, మోషే ద్వారా లిఖింపబడిన ఐదు పుస్తకములను (ఆది కాండము, నిర్గమ కాండము, లేవీయకాండము, సంఖ్యా కాండము, ద్వితీయోపదేశ కాండము) మాత్రమే పాటించు చుండిరి.

యూదా దేశపు గవర్నరు అయిన నెహెమ్యా మరణించిన తర్వాత క్రొత్త గవర్నరు వచ్చియుండెను. యూదా పట్టణము సిరియా పాలనలో ఉండెను మరియు తాత్కాలికముగా పౌరసంబంధమైన, మతసంబంధమైన అధికారములను ప్రధాన యాజకునికే ఇవ్వవలసినదిగా చట్టమందు వ్రాయ బడెను. ఇందుమూలముగా ప్రధాన యాజకుని కార్యాలయం అన్యుల కార్యాలయముగా మారెను. అర్తహషస్త నీహన్ క్రీ.పూ. 405 లో తన తండ్రి అయిన దరియన్నోతన్ (క్రీ.పూ. 423) పరిపాలన తర్వాత రాజాయెను. అర్తహషస్త నీహన్ పరిపాలించు చివరి దినములలో ప్రధాన యాజకుని కార్యాలయం సిరియా మరియు పెనేషియా గవర్నరుల చేతికి ఇవ్వబడెను. బాగోసస్ అను గవర్నరు యెహోన్నాను అను ప్రధాన యాజకుని స్థానంలో అతని సోదరుడైన యెహో షువను దేవాలయ గర్భాలయములో చంపివేసెను. ఇతను క్రీ.పూ 366 సం॥లో గవర్నర్ ఆదేశం ప్రకారం బలా త్కారంగా ప్రధాన యాజకత్వము పొందెను. గనుక ఈ చెడు పరిణామాలు కలిగినవి.

**(సశేషం)**

# మాయని మచ్చ

దేవుని చేతిలో అద్భుతంగా వాడబడిన దావీదు జీవితం లోని ఒక సంఘటనను గూర్చి అనేకులు అనేక విధములుగా ప్రశ్నిస్తూ ఉంటారు. కొందరు 'దావీదు భక్తుడే బత్షెబతో పాపం చేయలేదా? సామాన్యులమైన మనం చేయడంలో ఏముంది' అంటారు. కొందరు 'దావీదును దేవుడు క్షమించ లేదా? (2సమూ. 12:13). దయగల దేవుడు మనలను కూడా క్షమించడా?' అని అంటారు. తాము పాపం చేయ డానికి దావీదు జీవితంలోని ఈ సంఘటనను సాకుగా తీసుకుంటారు. కాని దావీదు జీవితంలో తరువాత జరిగిన సంఘటనల గురించి ఆలోచించరు. ఈ విషయాలు మనం ధ్యానించక మునుపు మనం ఒక సంగతి గుర్తుంచుకోవాలి. దావీదు తన జీవితంలోని ఈ ఒక్క సంఘటన మినహా తన జీవిత కాలమంతా దేవుని దృష్టికి యధార్థంగా జీవించాడు (1రాజులు 15:4). దావీదు జీవితంలోని ఒక్క పాపమును సాకుగా తీసుకుని జీవితాంతం పాపము చేయుట కంటే, దావీదు జీవితంలోని ఈ ఒక్క సంఘటనను మినహాయించి మిగిలిన యధార్థ, నీతి జీవితమును ఎందుకు మాదిరిగా తీసుకోరు? దేవుడు మన హృదయములోని సంకుచిత భావములను తీసివేయు గాక!

ఒకనాడు నేను ఒక వ్యక్తిని కలుసుకున్నాను. అతని నుదుట పెద్ద మచ్చ ఒకటి ఉంది. అది ఏమిటి? అని నేను అడిగాను. 'నా చిన్నతనంలో ఒక పెద్ద రాతిమీద పడ్డాను. అప్పుడు తగిలిన గాయపు మచ్చ యిది'. అని అన్నాడు. ఎంత ఆశ్చర్యము? గాయం మానింది గాని మచ్చ మాత్రం మిగిలింది. గాయం మానగానే మచ్చ మాసిపోదా? కొన్ని పెద్ద గాయాల మచ్చలు మరణం వరకు నిలిచి ఉంటాయి. ఆత్మీయ జీవితంలో కూడా అంతే! దేవుని బిడ్డ పాపం చేస్తే దేవుడు క్షమించినా (ఆ గాయం మానిపోయినా) మచ్చ మాత్రం కొన్నిసార్లు జీవితాంతం నిలిచే అవకాశం ఉంది.

అక్షరాల దావీదు జీవితంలో అలాగే జరిగింది. బాల్యం నుండి అతనికి దేవుని యెడల ఉన్న విశ్వాసం (1సమూ. 17:34-37), దేవుని ఆలయం కొరకు దావీదుకు ఉన్న అద్భుతమైన ఆశ (1దినవృ. 29:2-4), దేవుని సన్నిధిని దావీదు అనుభవించిన రీతి (కీర్త. 63:4-6) దావీదు ద్వారా దేవుడు ప్రవచించిన విషయాలు (దావీదు రాజు మాత్రమే కాదు ఆయన దేవుని ప్రవక్త కీర్తన 22:14-18). దావీదును గూర్చి దేవుడు ఇచ్చిన అద్భుత సాక్ష్యం (1సమూ. 13:14 అపో. కా. 13:22 దేవుని ఇష్టానుసారుడు), వీటన్నిటిని మరిపించింది బత్షెబతో దావీదు చేసిన పాపం. ఎన్నో సంవత్సరాలు ప్రయాసపడి సంపాదించుకున్న సాక్ష్యం ఒక్క క్షణంలో, ఒక్క పాపంతో మటుమాయం అయింది. ఎంత విచారకరం? అందుకే విశ్వాసీ, పాపము విషయం బహు అప్రమత్తత కలిగి యుండుము.

ఇప్పుడు ఈ సంఘటనలోని మరి కొన్ని విషయాలు తెలుసుకుందాం. నా చిన్ననాడు నేను మా కుటుంబంతో మద్రాసు పట్టణం వెళ్లాను. అక్కడ మాకు తెలిసిన ఒకరి ఇంటిలో మేము బస చేశాము. అప్పుడు ఆ ఇంటి వారికి సంబంధించిన ఒక గాజు వస్తువును పొరపాటున నేను పగుల గొట్టాను. ఈ విషయంలో నేను చాలా బాధపడ్డాను. ఆ ఇంటి వారు కూడా నన్ను క్షమించారు. గనుక నేను చాలా సంతోషించాను. ఇక్కడ మనం గ్రహించవలసిన ముఖ్య విషయం ఒకటి ఉంది. వారు నన్ను క్షమించినంత మాత్రాన జరిగిన నష్టం పూరింపబడుతుందా? పగిలిన విలువైన గాజు వస్తువు తిరిగి వస్తుందా? ఆ ఇంటి వారు అటువంటి మరియొక వస్తువును కొనుటకు కొంత డబ్బును సమకూర్చ వలసి వచ్చింది. మరియు ఇంటిలో పగిలిన ఆ వస్తువు ముక్కలన్ని వారు తీసివేశారు గానీ, ఒక ముక్క ఒక స్థలములో పడి కనబడలేదు. ఈ లోపల ఆ ఇంటి ఆవిడ గమనించక ఆ గాజు ముక్క మీద కాలు వేసింది. ఆమె బాధ పడింది. ఆ గాయం నయం చేసుకోవడానికి కొంత డబ్బు కావలిసి వచ్చింది. అవును నేను చేసిన ఒక చిన్న తప్పు ఎన్ని కష్టాలకు కారణం అయింది? నేను

క్షమించబడ్డాను. కాని ఆ క్షమాపణ నా తప్పు వలన కలిగిన నష్టాన్ని మాత్రం పూరించలేక పోయింది.

అక్షరాల దావీదు జీవితంలో అలాగే జరిగింది. దావీదు పశ్చాత్తాప పడగా దేవుడు దావీదు చావకుండా అతని పాపం పరిహరించాడు (2సమూ. 12:13). ఐతే ఆ పాప ఫలితం చాలా నష్టాలకు దారి తీసింది.

1. దావీదు ఇంటి వారికి సదాకాలము యుద్ధము జరిగింది (2సమూ. 12:10). ఈ కలహములలో తన ముగ్గురు కుమారులు చనిపోయారు. 1) అమ్నోను (2సమూ. 13:28-29 2) అబ్షాలోము (2సమూ. 18:14 3) అదోనీయా 1 రాజులు 2:25.

2. తన ఇంటి వారి వలననే తనకు అపాయం కలిగింది. (2సమూ. 12:11) అబ్షాలోము భయం చేత దావీదు అరణ్యమునకు పారిపోయాడు. (1సమూ. 15:13-18:33).

3. దావీదు బత్తెబలకు పుట్టిన మొదటి బిడ్డ మృతి చెందాడు. (2సమూ. 12:15,16-24).

4. దావీదునకు తన కుమారుల ఎదుట మాదిరి జీవితం లేక పోవుట వలన తన మరి ఇరువురు కుమారులు అదే పాపమందు మృతి చెందిరి. (1) అమ్నోను (2సమూ. 13:1-37) 2) అబ్షాలోము (2సమూ. 16:22, 18:14,15).

5. దావీదు రహస్యమందు ఈ పాపం చేసెను గాని తన ఉపపత్నులు పగటియందు అందరికి తెలియబడునట్లు చెరుపబడిరి (2సమూ. 12:12, 16:22).

6. ఈ కారణము వలన యెహోవా నామమునకు దూషణ కలిగెను (2సమూ. 12:14).

7. దావీదు పాపము మాయని మచ్చగా నిలిచిపోయింది. ప్రియ విశ్వాసీ, పాపము ఎంత భయంకరం? నిజంగా పశ్చాత్తాప పడినప్పుడు దేవుడు క్షమిస్తాడు గానీ ఆ పాపము ఫలితంగా జరిగే నష్టాన్ని మాత్రం చేసిన వారు అనుభవించాల్సి ఉంటుంది. అందుకే పాపం విషయమై తస్మాత్! జాగ్రత్త!. ఊరియా మరణ విషయములలో ముద్దాయి అయిన దావీదు తన నలుగురు కుమారుల అకాల మరణముతో తీర్పు తీర్చబడ్డాడు.

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యం ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

## గమనిక

క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.

**చందాదారుల వివరములు**

1. అపొ. ఎబినేజర్‌గారు (హైదరాబాద్)-1500 (నెలకు)
2. గంధం డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) -1000 (నెలకు)
3. మేరిసలోమి, సిరివెళ్ళ, కర్నూలుజిల్లా 5000/-
4. వి. రత్నమ్మ, హైదరాబాద్ 350/-
5. జి. కళావతి, ఒంగోలు 350/-
6. వి. కస్తూరి, భీమవరం 500/-
7. జయ, గుంటూరు - 1500/-
8. కె. రజిని, నరసరావుపేట - 1000/-
9. శ్రీమతి శాంతాగ్రేస్, మచిలీపట్నం 500/-
10. శ్రీమతి కె. కల్పన, గోవా - 350/-
11. శ్రీ జి. వెంకటేశ్వర్లు, కొత్తపల్లి - 350/-
12. శ్రీమతి సి. హెచ్. స్వయంప్రభ, చిలకలూరిపేట - 350/-
13. కె. రాజేష్, రాజమండ్రి - 350/-
14. శ్రీమతి వై. సంధ్యారాణి, ఒంగోలు - 2000/-

సాక్ష్యము

# ప్రేమించే దేవుడు

నా పేరు శ్రీవిద్య. నేను హిందూ కుటుంబంలో జన్మించాను. మా తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా ఒంగోలులో ఉంటున్నారు. నాకు ఒక చెల్లెలు ఉంది.

నేను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివే టప్పుడు రేడియోలో దేవుని వాక్యం వింటుండే దానను. అప్పటికి నాకు యేసయ్యను గురించిగానీ, క్రైస్తవ మతం గురించిగానీ ఏమి తెలియదు. అయితే రేడియోలో వాక్యం వినేటప్పుడు నాకు ఏదో క్రొత్తగా అనిపించి ఇంకా 'తెలుసు కోవాలనే కుతూహలం కలిగింది. అప్పుడు క్రైస్తవురాలైన నా క్లాస్‌మేట్ ఒకమ్మాయిని అడిగాను నేను క్రైస్తవ మతం లోకి మారవచ్చా అని. అప్పుడు ఆ అమ్మాయి 'మీ తల్లి దండ్రులకు ఏమీ అభ్యంతరం లేదా?' అని అడిగింది. అప్పుడు నేను 'వారికి అభ్యంతరమైనా సరే నేను మారతాను' అన్నాను. ఆ మాట నా ప్రమేయం లేకుండా అన్నాను. 'ఒకవేళ నేను యేసయ్యను నమ్ముకున్నా, హిందూ పూజలు అవీ చేయవచ్చా' అని అడిగాను. అప్పుడు ఆ అమ్మాయి 'చల్లగా అన్నా వుండు లేదా వెచ్చగా అన్నా వుండు, నులి వెచ్చగా వుండవద్దు అని యేసయ్య చెప్పాడు' అని చెప్పింది.

తర్వాత ఇంకెప్పుడు దాని గురించి ఆలోచించలేదు. మళ్ళీ రేడియోలో వాక్యము వినలేదు. యేసయ్యను గూర్చి ఆలోచించలేదు. ఇంటర్మీడియట్ పాసయ్యాక నేను బి.ఐ.టి. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరాను. ఆ డిగ్రీ కోర్సుకు విలువ లేదని తెలిసి చాలా బాధపడి ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నప్పుడు దేవుడు ఒక వ్యక్తి ద్వారా నేను ఇంజనీరింగ్ చదవటానికి మార్గం ఏర్పరచాడు.

నేను మద్రాసులో ఒక క్రైస్తవ ఇంజనీరింగ్ కాలేజీలో చేరాను. వేరే కాలేజీలో ఎక్కడా సీట్లు దొరకక తప్పని సరి పరిస్థితుల్లో ఆ కాలేజీలో చేరాల్సి వచ్చింది. అది క్రైస్తవ కాలేజి కావడం వల్ల నాకు క్రైస్తవ స్నేహితులు ఏర్పడ్డారు. వారి వల్ల నేను యేసయ్యను గురించి ఎక్కువగా తెలుసుకో గలిగాను. యేసయ్య వారి జీవితాలలో చేసిన ఆశ్చర్య కార్యములను నాతో పంచుకొన్నప్పుడు నేను చాలా ఆశ్చర్య పోయాను. ముందు నమ్మలేదు, తర్వాత వారిని బాగా పరిశీలించసాగాను. చిన్న అబద్ధం చెప్పటానికి కూడా వారు వెనుకాడటం, ఇతరుల గురించి ప్రార్థించడం, ఇతరులను ప్రేమించడం నన్నుఆకర్షించాయి. నేను కూడా క్రైస్తవురాలిగా వుండాలని ఆశ పడేదానను.

తర్వాత వారు అన్యుల గురించి, వారు యేసయ్యను నమ్ముకున్న తర్వాత వారు ఎదుర్కొన్న సమస్యలు, కష్టాలు చెప్పేవారు. అలాంటి సమయాల్లో కూడా వారు యేసయ్యను విడువకుండా ఆయన కొరకు అన్నింటిని భరించిన విధం నాతో పంచుకున్నప్పుడు నేను కూడా అలా ఉండాలని గట్టిగా నిశ్చయించుకున్నాను. యేసయ్యను నా స్వంత రక్షకునిగా అంగీకరించాను. ప్రతి ఆదివారం నా స్నేహితు లతో కలసి చర్చికి వెళ్తుండే దానను. వారితో కలిసి హాస్టల్లో ప్రార్థిస్తుండే దానను.

సెలవులలో నేను ఇంటికి వెళ్ళినప్పుడు మా నాన్న నన్ను అడిగాడు 'ఏమ్మా, హనుమాన్ చాలిసా చదువు తున్నావా?' అని. అప్పుడు నేను 'చదవటం లేదు' అని చెప్పాను. 'అయితే వెళ్ళి చదువుకో' అన్నాడు. మా నాన్నకి ఎదురు చెప్పటం ఇష్టం లేక పూజగదిలోకి వెళ్ళి చదవటానికి ప్రయత్నించాను. కాని నేను చేయలేకపోయాను. మా నాన్న నా ప్రక్కనే ఉన్నాడు. విగ్రహారాధన చేయకూడదని దేవుడు చెప్పిన విషయం గుర్తు వచ్చింది. 'నేను చదవను నాన్న' అని చెప్పి ప్రక్కకు వచ్చేశాను. చదవమని బ్రతిమిలాడాడు. కానీ నేను చదవలేదు. మా నాన్న నాతో మాట్లాడటం మానేశాడు. నేను వారి ఎదురుగానే యేసయ్యను ప్రార్థించే దానను. అప్పుడు అమ్మ నా దగ్గరకు వచ్చి యేసయ్యను ప్రార్థించవద్దని ఏడ్చేది. అందరూ దేవుళ్ళే యేసయ్యను మాత్రమే ప్రార్థించవద్దని చెప్పేది.

మా అమ్మ ఆరు, ఏడు సంవత్సరాలుగా మానసికమైన రుగ్మతతో బాధ పడుతుండేది. మేము ఎన్నో హాస్పిటల్లో

చూపించాము. షాక్ ట్రీట్మెంట్ కూడా ఇప్పించాము. అయినా బాగు కాలేదు. అప్పుడు అది ఒక జబ్బు అనుకున్నాను. అయితే మా అమ్మ నా దగ్గరకు వచ్చి ఏడ్చి 'ప్రార్థించవద్దు' అన్నప్పుడు, ఆమె అపవిత్రాత్మ కలిగి వున్నట్లుగా అనిపించింది. అప్పటి నుండి ఆమె కొరకు నేను ప్రార్థించసాగాను.

ఒకరోజు మానాన్న వచ్చి 'యేసయ్యను గురించి నేను కూడా విన్నాను, ఆయన చాలా మందిని స్వస్థపరచాడని. అయితే అది ఒకప్పుడు కదా ఇప్పుడు ఈ కాలంలో కూడా స్వస్థత జరిగితే నమ్మవచ్చు. మీ అమ్మని యేసయ్య ఒక నెలలోపు బాగుచేస్తే మేము కూడా ఆయనను నమ్ముతాము, ఒకవేళ అలా బాగుకాని పక్షంలో నువ్వు దేవున్ని వదలి పెట్టాలి అన్నాడు అని నాతో ఛాలెంజ్ చేశాడు. అందుకు నేను ఒప్పుకున్నాను. అయితే అలా జరగలేదు. ఆఖరి రోజు రాత్రి ఎనిమిది గంటలకు మా నాన్న నాకు ఫోన్ చేసి 'చెప్పిన సమయంలోపు మీ అమ్మ బాగు కాలేదు. కాబట్టి నువ్వు ఇచ్చిన మాట ప్రకారం దేవుణ్ణి వదిలెయ్యాలి' అన్నాడు. అప్పుడు నేను 'నా మాటైనా తప్పుతాను గాని దేవుణ్ణి వదలను' అన్నాను. అందుకు మా నాన్న 'మాట మీద నిలబడలేని దానివి నువ్వేం చేస్తావు, దేవుడు నీ ప్రార్థన ఏం వింటాడు' అన్నాడు. కాని నాకు ఇంకా విశ్వాసం ఉంది. ఆ రోజు గడవటానికి ఇంకా నాలుగు సమయం ఉంది కదా ఈ లోపు దేవుడు స్వస్థపరచక పోతాడా? అనుకున్నాను. అప్పుడు నేను దేవునికి ప్రార్థించాను 'యేసయ్యా, ఈ విషయం అందరికీ తెలుసు, ఇప్పుడు స్వస్థత జరగకపోతే అందరూ దేవుడు ఏమీ చేయలేదనుకుంటారు. కాబట్టి అందరూ ఆశ్చర్యపోయే రీతిలో మా అమ్మకి స్వస్థత చేసి అద్భుతకార్యం జరిగించమ'ని ప్రార్థించాను. తరువాత రోజు ఇంటికి ఫోన్ చేసి అమ్మకి బాగు అయిందా అని అడిగాను. కాని బాగు కాలేదని చెప్పారు.

నేను చాలా బాధపడ్డాను. అందరూ వచ్చి అడిగితే నేనేం సమాధానం చెప్పాలో నాకు అర్థం కాలేదు. నేను చాలా ఏడ్చాను. నా గురించి నేను అడగలేదు. అందరూ తెలుసుకొనేలా అద్భుతకార్యం జరగలేదని నేను చాలా బాధపడ్డాను. అంతేకాక నేను కాలేజీలో మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టులో ఫెయిల్ అయ్యాను. అప్పుడు కూడా మా నాన్న అడిగాను 'నువ్వు యేసయ్యను నమ్ముకున్నావు కదా! ఆయన నిన్ను పాస్ చేయించ లేకపోయాడా?' అని అన్నాడు. అయినప్పటికీ యేసయ్య మీద నా విశ్వాసం సడలలేదు. దేవుడు మంచికే చేసి వుంటాడని నా మనసులో అనుకున్నాను.

నేను సెలవలకు మరలా ఇంటికి వెళ్ళాల్సి వచ్చింది. వాళ్ళు నన్ను అడిగినప్పుడు నేను వారికి ఎలా సమాధానం చెప్పాలో సిద్ధపడ్డాను. నేను వారితో దేవుని వాక్యం పంచుకోవాలనుకున్నాను. నేను వారిని ఎంతో బ్రతిమాలి వాక్యం వినమని చెప్పేదానను. మా నాన్న విన్నప్పటికీ ఇవన్నీ నాకు తెలుసు నేను ఎప్పుడో విన్నాను అంటుండేవాడు.

నేను మరలా కాలేజీకి వచ్చినప్పుడు అక్కడ దేవుని కూటము జరుగుతుందని తెలిసి నేను వెళ్ళాలనుకున్నాను. కాని హాస్టల్ కి వెళితే వెళ్ళలేనని తెలిసి నేరుగా కూటము దగ్గరకు వెళ్ళాను. అప్పుడు మా నాన్న వాళ్ళు హాస్టల్‌కి ఫోన్ చేసినప్పుడు నేను హాస్టల్లో లేనని తెలిసి, వాళ్ళు వచ్చి చదువు మాన్పించి ఇంటికి తీసు కెళ్ళారు. నేను ఆ కాలేజీలో, ఆ హాస్టల్లో ఉంటే స్నేహితులతో కలిసి చర్చీకీ, దేవుని కూటాలకు వెళ్తానని కాలేజీ మార్పించాలని చూశారు. కానీ కుదర్లేదు. అందుకని నాకు పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నారు. అది కూడా కుదర్లేదు.

వారు నా గురించి ఎంతో డబ్బు ఖర్చుచేసి నన్ను చదివించాలనుకున్నప్పుడు వారి ఎదురుగా ఉండి వాళ్ళను బాధపెట్టటం ఇష్టంలేక నేను చర్చికి వెళ్ళను, కాలేజీకి వెళ్ళి చదువుకుంటానని నేను మరలా కాలేజీకి వచ్చాను. చర్చికి వెళ్ళకుండా ఉన్నంత మాత్రాన దేవుడు నాకు దూరం కాడు. నా హృదయంలో నుండి ఆయనను ఏ పరిస్థితులూ తీసివేయలేవని నిశ్చయించుకున్నాను. తర్వాత నేను అప్పుడప్పుడూ చర్చికి వెళ్తుండేదాన్ని. ప్రతి ఆదివారం ఉదయం 7-30 గంటలకి మా నాన్న ఫోన్ చేసేవాడు. వాళ్ళు ఫోన్ చేసిన తర్వాత చర్చికి వెళ్ళేదానను. కానీ మా అమ్మ ఒక విషయం చెప్పటం మర్చిపోయి మళ్ళీ 9-00 గంటలకు ఫోన్ చేసింది.

అలా నేను వారికి తెలియకుండా చర్చికి వెళ్తున్నానని తెలిసింది. వాళ్ళు మళ్ళీ కాలేజీ మాన్పించాలని చూశారు. కానీ జరగలేదు.

మళ్ళీ నేను సెలవలకు ఇంటికి వెళ్ళినప్పుడు మా నాన్న 'ఎందుకిలా చేస్తున్నావు? తల్లిదండ్రులను ఎందుకిలా బాధ పెడుతున్నావు? అది పాపం' అని ఏడ్చాడు. అప్పుడు నేను 'మన కుటుంబానికి శాంతి యేసయ్యలో మాత్రమే ఉందని నమ్మి ఇదంతా చేస్తున్నాను, మీకు ఈ విషయం ఇప్పుడు అర్థం కాదు, ఒకరోజు తెలుస్తుంది' అని చెప్పాను. మా నాన్న ఏడ్వడం నేను ఎప్పుడూ చూడలేదు. కానీ నా విషయంలో ఏడ్చి 'మమ్మల్ని ఇలా కష్టపెట్టకు" అన్నప్పుడు నేను చాలా గాయపడ్డాను. అప్పుడు నేను వాళ్ళని మళ్ళీ సమాధానపరచి నేనలా చెయ్యను, మనమందరం బాగుండాలని చేశాను' అన్నాను. అప్పుడు మా నాన్న 'నువ్వు అన్నీ మర్చిపోయి మా బాగా చదువుకో, మీ అమ్మను నేను బాగు చేపిస్తాను' అన్నాడు. అది మా నాన్న చేయలేడని తెలిసినా సరే అని అన్నాను. ఇప్పుడు నేను ఒక రహస్య క్రైస్తవురాలిగా వుంటున్నాను. నేను మా చెల్లికి కూడా సువార్త చెప్పాను. తను కూడా యేసయ్యను నమ్ముకుంది. కానీ ఇంట్లో ఉండే ఒత్తిడి, అశాంతి కారణంగా తను కూడా రహస్య క్రైస్తవురాలిగానే ఉంది. నేను యేసయ్యని గూర్చి తెలుసుకోకముందు నాకు ప్రేమ, బంధం అంటే తెలీదు. ఇతరులు నా ఎదుట ఎంత బాధపడుతున్నా నాకు కనీసం చీమ కుట్టినట్లు కూడా వుండేది కాదు. చాలా కఠిన హృదయం నాది. యేసయ్యను నమ్ముకున్నా తర్వాత నేను పూర్తిగా మారిపోయాను. దేవుని ప్రేమతో నింపబడ్డాను. ఇప్పుడు నేను పదిమందికి దేవుని ప్రేమను పంచగలను. దేవుడిచ్చే శాంతి, ప్రేమ, సంతోషం ముందు నేను ఎదుర్కొనే సమస్యలు ఏవీ పెద్దవి కావు. ఎటువంటి కష్టమైన స్థితిలోనైనా ఆయనను విడువకుండా ఉండునట్టి బలమైన విశ్వాసం నాకు దేవుడిచ్చాడు. దేవుడు నాకు నా కుటుంబ విషయంలో వాగ్దానం చేశాడు (యిర్మియా 31:16).

(2002 నవంబరులో నిత్యజీవజలములో మాస పత్రికలో ప్రచురించబడినది యధాతథంగా).

## కొడవటికంటిగారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. 40 |
| 2. | ఆసెనతు | రూ. 150 |
| 3. | అపొస్తలుడు | రూ. 250 |
| 4. | నా చిత్తానుసారుడు | రూ. 110 |
| 5. | గుంట నుండి మింటికి | రూ. 50 |
| 6. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. 60 |
| 7. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. 65 |
| 8. | తోటలో పనివాడు | రూ. 20 |
| 9. | గోత్రకర్త (యాకోబు) | రూ. 50 |
| 10. | నా కుటుంబము | రూ. 25 |
| 11. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. 50 |
| 12. | నా కుమారి (రూతు) | రూ. 60 |
| 13. | నా స్నేహితుడు | రూ. 50 |
| 14. | అంత్యదినములలోని యధార్థ ప్రవక్త | రూ. 50 |
| 15. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. 65 |
| 16. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. 65 |
| 17. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. 65 |
| 18. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. 65 |
| 19. | సువార్తలలోని యేసుకథ | రూ. 75 |
| 20. | యేసుకథ రెండవ భాగం | రూ. 75 |
| 21. | యేసుకథ మూడవ భాగం | రూ. 75 |
| 22. | జీవనమంతయు | రూ. 40 |
| 23. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. 65 |
| 24. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. 65 |
| 25. | ఓ చినుకునవుతా... | రూ. 30 |
| 26. | మిక్కిలి సాత్వికుడు | రూ. 150 |
| 27. | విశ్వాసము విజయము-1 | రూ. 70 |
| 28. | విశ్వాసము విజయము-2 | రూ. 70 |
| 29. | విశ్వాసము విజయము-3 | రూ. 70 |
| 30. | హదస్సా | రూ. 70 |
| 31. | మిక్కిలి సాత్వికుడు | రూ.150 |

పుస్తకములు కావలసినవారు :
రెవ. డా॥ కొడవటికంటి ఇమ్మానియేల్ రాజేంద్ర
కృపాదానంగారివీధి, క్లౌపేట, 6వ లైను
ఒంగోలు-523001
ప్రకాశం జిల్లా, ఫోన్ : 9440217726

# దేవుడు - సిరి

***"ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండ నేరడు; అతడు ఒకని ద్వేషించి యొకని ప్రేమించును; లేదా యొకని పక్షముగా నుండి యొకని తృణీకరించును; మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు" (మత్తయి 6:24).***

ఈ లోకములో డబ్బు లేకపోతే బ్రతకలేము అన్నది ప్రతి ఒక్కరి భావన. డబ్బుని ప్రేమించని వారు ఎవరూ ఉండరు. డబ్బు కోసం ఏం చేయడానికైనా వెనుకాడరు. డబ్బు అనేది బంధాలను వేరు చేస్తుంది. డబ్బు కోసం మనుష్యులనే కాదు దేవున్ని కూడా మోసం చేస్తారు. దేవుని గురించి బోధించే వారే డబ్బు ఆశిస్తుంటే ఇంక సామాన్యులు డబ్బుని ప్రేమించడం సామాన్యమైన విషయం. అనేకమంది ధనమును ప్రేమిస్తూనే దేవున్ని ప్రేమించాలని అనుకుంటారు. అదెన్న టికిని సాధ్యం కాదు. ధనమును ప్రేమించేవారు మాత్రమే తన అవసరాలకు ధనము సంపాదించాలనుకుంటారు. దేవున్ని ప్రేమించే వారు తమ అవసరాలన్నిటికీ దేవునిపై ఆధార పడతారు. నీవు ఎంత నీతిమంతుడవైనా సరే, ధనమును ప్రేమిస్తున్నట్లయితే దేవున్ని ప్రేమించలేవు.

ఒక ధనవంతుడైన యౌవనస్తుడు యేసుప్రభువు దగ్గరకు వచ్చి నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని అడిగినప్పుడు, దేవుని ఆజ్ఞలను పాటించమని చెప్తాడు యేసుప్రభువు. అప్పుడు ఆ యౌవనస్తుడు చిన్ననాటి నుండి నేను ఆజ్ఞలన్నీ పాటిస్తున్నానని యేసుతో అన్నప్పుడు, ఆయన 'నీ ఆస్తిని అమ్మి పేదలకిచ్చి నన్ను వెంబడించుమ'ని చెప్తాడు. ఆ యౌవనస్తుడు మిగుల ధనము కలిగి ధనమును ప్రేమిస్తు న్నందువల్ల యేసు చెప్పిన మాటలు అతనికి రుచించక వ్యసన పడుతూ వెళ్ళిపోతాడు. నిత్యజీవమునకు వారసుడు కాలేక పోవడానికి అతని ధనము అతనిని ఆటంకపరచింది. దేవుని ఆజ్ఞలన్నిటినీ తూ.చ. తప్పకుండా పాటిస్తున్నప్పటికీ ధనము అతనిని దేవునికి దగ్గర చేయలేకపోయింది. అందుకే 'ధనవంతుడు దేవుని రాజ్యములో ప్రవేశించుట కంటె సూదిబెజ్జములో ఒంటె దూరుట సులభము' (లూకా 18:25) అని యేసుప్రభువు చెప్పాడు.

మనము కూడా అంతే మనకున్న ధనాపేక్ష దేవున్ని వెంబడించేలా చేయదు. క్రమం తప్పకుండా చర్చికి వెళ్ళినా, బైబిలు చదువుకున్నా, ప్రార్థన చేసుకున్నా, చందాలు ఇచ్చినా డబ్బు మీద వ్యామోహాన్ని వదులుకోలేము. ఒక్క ఒరలో రెండు కత్తులు ఇమడలేనట్లు ఒకే హృదయములో దేవునికి, డబ్బుకి చోటు ఉండదు. దేవున్ని హృదయ పూర్వకంగా నమ్మలేని వారు మాత్రమే ధనమును ఆశ్రయిస్తారు. ధనమును ఆశ్రయించిన వారికి పరలోకరాజ్యములో ప్రవేశము ఉండదు. 'ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము' (1తిమోతి 6:10) కావడము వలన అనేకమంది దేవున్ని వదలి తమ్మును తామే పొడుచుకొనే పరిస్థితుల్లోకి వెళ్ళిపోతారు. విశ్వాసులు సైతం తమ విశ్వాసాన్ని వదిలేస్తారు.

ఐగుప్తు నుండి కనానుకు బయలుదేరిన సుమారు 20 లక్షలమంది ఇశ్రాయేలీయులను 40 సం॥లు పోషించాడు దేవుడు. అలాగే ఈ భూమి మీద నుండి పరమకనాను చేరే వరకు దేవుని మీద ఆధారపడిన ప్రతి ఒక్కరినీ పోషించే బాధ్యత దేవుడే తీసుకుంటారు. ఈ లోకంలో ప్రతిఒక్కరూ వారు జీవించినంత కాలము దేవుని మీదనే ఆధారపడి జీవించాలని దేవుడు కోరుకుంటున్నాడు. అయితే సాతాను మనుషుల్ని దేవునికి దూరపరచాలన్న ఉద్దేశ్యంతో దేవున్ని కాక ధనముని ఆశ్రయించులాగున మనల్ని ప్రేరేపిస్తుంటాడు. మన అవసరాలన్నీ తీర్చుకోడానికి ధనము కూర్చుకోమని ప్రేరేపిస్తాడు. అందుకే అందరూ ధనమును ప్రేమిస్తారు. మనము ధనమును దేవునిని ఏక కాలములో ప్రేమించలేము. దేవునికిని సిరికిని దాసులుగా ఉండలేము. అది అసాధ్యం కూడా. ఇంతకీ మీ యజమాని ఎవరు? దేవుడా? ధనమా? తేల్చుకోవాల్సింది మీరే.

# కృపాదానం

సాయంకాలం 6 గంటలకి సామర్లకోట చేరింది ట్రైన్. నేను ట్రైన్ దిగి స్టేషన్‌లో క్వార్టర్సులో ఉన్న పి.డబ్ల్యు.డి. ఇంజనీరు గారింటికి వెళ్ళి వచ్చాను.

అదే ట్రైన్‌లో బి.ఇడి. డిగ్రీ కోసం విశాఖపట్నం వెళ్తున్న గుళ్లం ఇందిరక్క ఉన్నది.

ఇందిరక్కను పలకరించిన తరువాత, ఎవరో ఒకతను తినే దోసకాయలు నాలుగు బుట్టలు సీటు క్రింద పెట్టి వెళ్ళాడు. మరలా విశాఖ దగ్గరలో వస్తాను కొంచెం చూస్తుండమ్మా అని చెప్పి వెళ్ళాడు అంది ఇందిరక్క. ఇద్దరం చెరొక బెంచీ మీద పండుకొని నిద్రపోయాం. నాకు ఉదయం 2:30 గంటలకు మెలకువ వచ్చింది.

ఎదురుగా ఒక యవ్వనస్తుడు సింగల్ సీటులో కూర్చుని ఉన్నాడు. ఆ దోసకాయ బుట్టలు కాపలా కాసినందుకు వందనాలు అన్నాడు. ఇక అది మొదలుకొని యోగ క్షేమాలు అడుగుతూ మాట్లాడుతూ విశాఖలోని తన రకరకాల బిల్డింగులు గురించి తనకున్న పెట్రోలు కంపెనీలు చెబుతూ ఉన్నాడు. రైలు ఆగంగానే ఇద్దరు కూలీలు వచ్చి ఆయనకి నమస్కారం చేశారు. ఆ దోసకాయ బుట్టలతో పాటు, మా ఇద్దరి లగేజి కూడా వారికి చూపించాడు ఆ యవ్వనస్తుడు.

కూలీలు సామాను తీసుకొని బయలు దేరారు. "మీరు ఇంత చీకటిలో ఎలా వెళ్తారు? ఇప్పటికి మా హాస్పిటల్‌లో ఉండి తెల్లవారిన తర్వాత వెళ్ళండి" అని శోభా క్లినిక్‌కి రెండు రిక్షాలు మాట్లాడి, ఒక రిక్షాలో ఆయన మరొక రిక్షాలో నన్ను ఇందిరక్కను ఎక్కించి కె.జి. హాస్పిటల్ ఎదురుగా ఉన్న శోభా క్లినిక్‌కి తీసుకువచ్చాడు.

ఆ యవ్వనస్తుని పేరు రమణ. ఆయన భార్య డాక్టరు. ఆ బిల్డింగ్ ఇంతకుముందు లాడ్జింగ్ కావడంతో అక్కడ అనేకమైన గదులు ఉన్నాయి. ఆ రాత్రి జామున నర్సులతో వేడినీళ్ళు కాయించి స్నానానికి ఏర్పాట్లు చేసి, తెల్లవారిన తరువాత కారులో ఇందిరక్కను ఆమె వెళ్ళవలసిన లేడీస్ హాస్టల్‌లో దించి, నన్ను డాక్టరు తిరుమల గారింట్లో దించి వెళ్ళారు రమణగారు.

సాయంకాలం మూడు గంటలకు డాక్టరు తిరుమల గారింట్లో (ఒంగోలు శర్మ కాలేజి ఫిలాసఫి లెక్చరర్ కృష్ణారావు గారి తండ్రి, ఫారిన్ రిటర్న్) నిద్రపోతున్న నన్ను రమణగారు వచ్చి, నిద్రలేపి కారులో తీసుకొనివెళ్ళి, కాన్వొకేషన్ గౌను అద్దెకు తీసిచ్చి అక్కడ నుండి యూనివర్సిటి వద్ద వదిలిపెట్టి వెళ్ళాడు. డిగ్రీ పట్టా తీసుకొని వసున్న నాకు ఎదురుగా ఒక కారు వచ్చి ఆగింది. సార్ మిమ్మల్ని డాక్టరు తిరుమలరావు గారింట్లో దించమని రమణ అయ్యగారు పంపించారు అని చెప్పాడు కార్ డ్రైవర్.

కారులో డాక్టరు తిరుమలరావుగారి ఇంటి వద్ద దింపి వెళ్లాడు డ్రైవర్. తర్వాత డాక్టరు రమణ ఆయన స్నేహితుడు, ఐరన్ మర్చంటు రత్నంగారి బలవంతం మీద నాలుగు రోజులు వారితో విశాఖపట్నంలోనే ఉండవలసి వచ్చింది.

విమానాశ్రయం, నౌకాశ్రయం, ఊరి బయట వారి ప్లాస్టిక్ బొమ్మల ఫ్యాక్టరీ చూపించారు.

రమణగారు మంచి స్థితిమంతులు. రమణ మామగారి ఇల్లు, డ్రస్సింగ్ టేబుల్ చూడటానికి రెండు గంటలు పట్టింది. వారింటి డోర్‌మాట్ (కాళ్ళపట్ట) కూడా ఒక ఆశ్చర్యమే.

విశాఖపట్నంలో ఉన్నంతకాలం కార్లలోనే ప్రయాణం, కింగ్స్‌కే పెద్దకారు, అంబాసిడర్, 3 ప్రిమియర్ ఫియట్ కార్లలో ప్రయాణించాడు శ్యామ్. ఒక్కొక్క స్థలం చూడటానికి ఒక్కోకారు ఉపయోగించారు రమణగారు.

నాలుగు రోజుల తర్వాత రమణ వారి స్నేహితులతో కలసి వచ్చి ఒంగోలుకు రైలు టికెట్టు తీసిచ్చి రైలు ఎక్కించారు. ఆ తరువాత ఒంగోలులో శర్మ కాలేజి ఫిలాసఫి లెక్చరర్‌గారి అమ్మాయి జయ, ఆమె చిన్నమ్మ నన్ను నిలదీశారు. శోభా క్లీనిక్ డాక్టరు రమణ మీకెలా తెలుసు?

అన్నారు. రైల్లో పరిచయము అన్నాను. కాని ఎవరూ నా మాటలను నమ్మలేదు.

ఒంగోలు వచ్చిన తర్వాత నా క్లాస్‌మేట్స్, ఏరా ప్లిమల్ కారులో తిరుగుతున్నావు. మరొక ఫ్రెండ్ నువ్వు కింగ్స్‌వే కారులో తిరుగుతున్నావు, ఎక్కడివి? మీ చుట్టాలా? ఒక్కో రోజు ఒక్కో కారులో తిరుగుతున్నావు అని అడిగేవారు. కాదయ్యా రైలులో పరిచయమైన వ్యక్తి ఆయన కార్లలో నన్ను తీసుకెళ్లాడు అని చెప్పాను. అయితే నా స్నేహితులెవ్వరూ నన్ను, నా మాటలను నమ్మలేదు.

వారు నమ్మకపోవడంలోను అర్థముంది. కేవలం రైలులో పరిచయమైన వారిని ఎవరూ అలా కార్లలో తిప్పడం, అన్ని ప్రదేశాలు చూపించడం చేయరు కదా!

నాన్న నన్ను విశాఖపట్నం రైలు ఎక్కిస్తూ దేవుడు తన దూతను నీకు ముందుగా పంపిస్తాడు అన్న మాటకు అర్థం ఏంటో నాకు అర్థమైంది.

విశాఖలో ఉన్నన్ని రోజులు డా॥రమణగారి పరిచర్య చూసి మొదట్లో ఈయనకు పిచ్చా! అనుకున్నాను. పిచ్చే అయితే నా ఒక్కనికే ఇంత పరిచర్య ఎందుకు చేస్తాడు? చేయిస్తాడు? దేవుని దూత ఆయనను ఆవరించి ఇంత అద్భుతము చేయటానికి నాన్న ప్రార్థనయే కారణం అనుకున్నాను.

1962లో ఆంధ్ర ప్రాంతము నుండి రైల్వే ఉద్యోగాలు విరివిగా వ్రాశారు. దేశమంతటిలో రైల్వేలో ఉద్యోగాలకి ప్రాధాన్యమిచ్చారో ఏమో తెలియదు కాని, నా క్లాస్‌మేట్స్‌లో ఎక్కువమంది రైల్వేలో చేరారు. కృపాదానం పెద్దకుమారు నిగా, నేను పుట్టగానే ప్రభువు సేవ కొరకు ఏర్పరచబడ్డాను. కాబట్టి ఉద్యోగాన్వేషణ చేయలేదు.

కృపాదానం రెండవ కుమారుడు జోసఫ్. వానితో పాటుగా చాలామంది రైల్వేలో అప్లై చేసారు. చాలా మందికి ఇంటర్వ్యూలకు ఉత్తరాలు కూడా వచ్చాయి. కొంతమందికి సెలెక్టెడ్ అని ఉత్తరాలు వచ్చాయి. కాని జోసఫ్ విషయంలో ఏ విషయం తెలియకున్నది. పోనీ నాట్ సెలెక్టెడ్ అని ఉత్తరం వచ్చినా ఒక రకంగా విశ్రాంతి వచ్చినట్లే.

రోజు రైల్వే డిపార్ట్‌మెంట్ వారి కాగితాల కోసం ఎదురు చూసి చూసి విసిగిపోయి, బాబా అనే జోసఫ్ స్నేహితుడు ఒరిస్సాలో పనిచేస్తూ ఒంగోలు వచ్చి, ఒరిస్సాకు రా! అక్కడ ఉద్యోగాలు బాగున్నాయి. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం, జంతువులు దగ్గరలోనే ఉన్నప్పటికి మనకు ప్రొటెక్షన్ ఉంటుంది, భయపడాల్సిన పని లేదు అని చెప్పాడు. చివరికి జోసఫ్ ఒరిస్సా వెళ్ళటానికి నిశ్చయించుకున్నాడు.

ఈ సంగతి తండ్రి కృపాదానంగారికి చెప్పాడు. ఆయన అందుకు సమ్మతించలేదు. రైల్వేలో ఉద్యోగం వస్తుంది అన్నాడు. అపాయింట్‌మెంట్ కాగితాలు ఆయన చూచి నట్లుగా చెప్పాడు.

“చాలాకాలం అయిపోయింది నాయనా! చాలామంది ఉద్యోగాలలో చేరారు. కొంతమందికి నాట్ సెలెక్టడ్ అని కాగితాలు వచ్చినవి కాబట్టి ఇంకా ఉద్యోగం వస్తుంది అని చెప్పలేము” అన్నాను నేను.

మనం ప్రార్థన చేస్తున్నాము, మనం ప్రభువుని అడిగినవి మనం పొందాము అని నమ్మాలి కదా అన్నాడు. అది ఆత్మీయమైన విషయాలలో కదా! అన్నాను. ఆత్మీయ విషయాలు శరీర విషయాలు అని వేరు వేరుగా ఉండవు. అన్నిటికి ప్రభువే మనకు. నేను ఆయన సేవకుడిని నా బిడ్డలకు ఆయన ఖచ్చితంగా ఉద్యోగం ఇస్తాడు అన్నాడు.

జోసఫ్‌కి అనుమానం పెరిగిపోతుంది. ఇంట్లో కూర్చుని పోస్టు కోసం ఎదురుచూడటం ఇంకా కష్టమై పోయింది. కృపాదానంగారి ప్రార్థన ఫలిస్తుందని చాలామంది నమ్మేవారు.


**దయచేసి పత్రిక కొరకు మీరు పంపించే చందా మనియార్డర్ ద్వారా పంపదలుచుకుంటే ఈ క్రింద అడ్రసుకు పంపగలరు.**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర,**

**ఎడిటర్, హన్నాకృప ఆధ్యాత్మిక మాసపత్రిక**

**6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001**

**ప్రకాశం జిల్లా, ఫోన్: 9440217726**

స్త్రీల విభాగం

# నయమాను భార్య

హన్నాకృప పాఠకులకు యేసుక్రీస్తు వారి నామములో శుభాభివందనములు.

పరిశుద్ధ గ్రంథములో స్థానం సంపాదించిన అనేక మంది స్త్రీ మూర్తుల జీవితాలు నేటితరం క్రైస్తవ స్త్రీ సమాజానికి ఆదర్శప్రాయం. ఈ సంచికలో మనం ధ్యానించ బోతున్న ఆదర్శ జీవితం నయమాను భార్యది.

2రాజులు 5వ అధ్యాయంలో నయమానును గూర్చిన వృత్తాంతం ఉన్నది. సండేస్కూల్ నుండే క్రైస్తవులకు చిరపర చితమైన బైబిల్ భాగం ఇది.

ఇశ్రాయేలునకు ప్రక్కనే ఉన్న దేశం సిరియా. సిరియా సైనిక పరంగా బలమైన దేశంగా పరిగణించవచ్చు. సిరియ నులు తమ ప్రక్క దేశ ప్రజలైన ఇశ్రాయేలీయులపై గుంపులు గుంపులుగా దండెత్తి వెళ్ళి వారిని దోచుకునే వారు. దొరికిన వారిని చెరగా తీసుకునిపోయి వారిని బానిసలుగా మార్చి విక్రయించేవారు. బానిసలుగా అమ్మబడిన వారికి ఎటువంటి స్వేచ్ఛ, స్వతంత్రాలు, హక్కులు, ఇష్టాలు ఉండవు. వారిని కొన్న యజమానుల మాటను అమలు చేయడమే వారి పని.

నయమాను భార్య మృధుస్వభావి, దయాగుణం గలది. ఆమె తన పనివారితో దయగా మాట్లాడేది. సహజంగా డబ్బు ఉన్నవారు తమ క్రింద పనిచేసే వారితో మాటలు కలపరు. వారి ఆర్థిక స్థాయి అందుకు వారిని అనుమ తించదు. వారితో కాస్త కటువుగానే ప్రవర్తిస్తారు. ఈ కాలంలో కూడా అనేకులు తమ ఆర్థిక స్థితిని బట్టి కాస్త వింతగా ప్రవర్తిస్తుంటారు అంటే తమ కంటే తక్కువ ఆర్థిక స్థితి గలవారిని చులకనగా చూడటం, పనివారిని మనుష్యుల వలె కాక కేవలం జీతానికి పనిచేసే యంత్రాల్లాగా చూడటం వంటివి. దానినే వారు స్థాయి అంటారు. సామాజికంగా ఎంతో పురోగాభివృద్ధి సాధించిన ఈ కాలంలోనే జనాలు ఇలా ఉంటే ఇక రాజుల కాలంలో ఆర్థిక అసమానతలు, స్థాయి భేదాలు సర్వసాధారణమైన కాలంలో నయమాను భార్య తన పనివారితో కఠిన వైఖరితో కాక మృదువైన వైఖరి కనుపరచింది. ఆమె స్వభావం ఆమెకు అలంకారంగా ఉన్నది.

"సాధువైనట్టియు, మృదువైనట్టియునైన గుణమను అక్షయాలంకారము గల మీ హృదయపు అంతరంగ స్వభా వము మీకు అలంకాముగా ఉండవలెను" 1పేతురు 3:4 ఆమె మృదుస్వభావి కాకుంటే ఆమె దగ్గర పనిచేసే ఒక పనిపిల్ల, అందులోను బానిస, ఆమెతో మాట్లాడటానికి ప్రయత్నించి ఉండేది కాదు.

నయమాను భార్య భర్తను ప్రేమించునట్టి ఆదర్శవంతు రాలైన భార్య అని చెప్పవచ్చు. ఆ కాలంలో కుష్ఠరోగమునకు వైద్యము లేదు. వైద్యంతో నయం చేయ గలిగేది అయితే నయమాను తనకున్న ఆర్థిక స్థితిగతులతో ఎప్పుడో ఆరోగ్యవంతుడయ్యేవాడు అంటే అతని రోగానికి వారి వద్ద పరిష్కారం లేదు. పైగా అది అంటువ్యాధి. కుష్ఠవ్యాధి కలిగిన వారిని ఎవరూ ఆదరించరు. అప్పటి వరకు సమాజంలో ఉన్న స్థితి తారుమారయ్యే పరిస్థితి. ఆర్థిక బలం ఉన్నప్పటికి ఆదరణ, గౌరవం కొరవడటం, ఛీత్కారాలు ఎదుర్కొనవలసి రావడంవంటి పరిస్థితిని నయమాను ఊహించి ఉండవచ్చు. ఆ స్థితిలో నయామను మానసికంగా కృంగి నిరాశ నిస్పృహలకు గురి కాకుండా అవసరమైన ఆత్మీయ స్థైర్యం కలిగించే విధంగా ఆమె ప్రవర్తన ఉన్నది. అందుకే అతను తన ఆరోగ్య స్థితిని గూర్చి, సిరియా, ఇశ్రాయేలు రాజులతో మాట్లాడటానికి వెరవలేదు.

నయామానుకు అతని పూర్వ ఆరోగ్య స్థితి తీసుకు రావడానికి అతని భార్య తన పరిధిలోని ప్రయత్నాలు చేసి ఉండవచ్చు. వైద్యపరంగా లేదా డబ్బు వెచ్చించి చేయ గలిగింది ఏమి లేదు కాబట్టి ఆమె తగిన సహాయం కొరకు దేవునివైపు చూచింది. సిరియా వాసి కాబట్టి ఆ దేశ ఆచా రాలు పూజలు చేసి ఫలితం లేక నిజదేవుని గురించిన

ఆలోచనలతో సతమౌతున్న వేళలో ఇశ్రాయేలు చిన్నదాని ద్వారా దేవుడు ఆమె హృదయవాకిలి చేరాడు.

“వివేకము కలిగి దేవుని వెదకు వారు కలరేమో అని యెహోవా ఆకాశము నుండి చూచి నరులను పరిశీ లించెను” కీర్తనలు 14:2

బానిసయైన తన యెడల తన యజమానురాలు చూపిన దయకు కృతజ్ఞతగా, నిజదేవుని గురించిన సంగతులు ఆమెకు తెలియపరచింది. బానిస యజమాను రాలితో మాట్లాడటమే అసాధ్యంగా పరిగణింపబడే కాలంలో ఇశ్రాయేలు చిన్నది నయమాను భార్యకు సువార్త చెప్పింది. అయితే చిన్నది చెప్పిన వెంటనే నయమాను భార్య అంగీ కరించి ఉండకపోవచ్చు. కానీ ఆ చిన్నది చెప్పిన సంగతు లను గురించి ఖచ్చితంగా ఆలోచించింది. నిజదేవుని గురించిన తృష్ణ తన హృదయంలో పెరిగే కొద్దీ ఇశ్రాయేలు చిన్నది చెప్పిన మాటలపై నమ్మకముంచింది. ఆమె తన హృదయపు వాకిలి వద్ద నిలబడి తడుతున్న దేవుని స్వరం విని తలుపులు తెరిచింది. ఆమె ఎరగని దేవునిపై విశ్వాస ముంచింది.

తాను నమ్మినంతనే తన సమస్యకు పరిష్కారం దొరకదు పైగా మరొక సమస్య ప్రారంభమైంది. అదేమంటే తను విశ్వసించిన విషయంపై తన భర్త సానుకూలంగా స్పందించాలి. తన మాటలు అంటే ఒక బానిస చెప్పిన మాటలు అంగీకరించి ప్రవక్త వద్దకు వెళ్ళాలి. నయమాను సైన్యాధ్యక్షుడు కాబట్టి అతనికి తన దేశం పట్ల భక్తి భావన ఉండి ఉంటుంది. తమ దేశం కంటే బలహీనముగా ఎంచబడుచున్న ఇశ్రాయేలు వెళ్ళి సహాయం అర్థించడం అందులోను ఒక బానిస చిన్నది చెప్పిన మాటలు ఆధారం చేసుకొని తన వంటి గౌరవ ప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి ప్రవర్తించడం కొంత సంకోచించ దగ్గ విషయమే. అసలే నయమానుది దూకుడు స్వభావము. ఆలోచన కంటే ముందు కోపం పుడుతుంది.

అయితే నయమాను భార్య తన భర్తతో ఎంతో వివేకవంతంగా ప్రవర్తించి తన భర్తను ఇశ్రాయేలు దేశం పంపడంలో సఫలీకృతురాలైంది.

ఫలితంగా తన భర్త ఆరోగ్యాన్ని తిరిగి పొందు కున్నాడు. నిజదేవున్ని తెలుసుకున్నాడు. కోల్పో యిన కోల్పోబోతున్న తన కుటుంబ సంతోషాన్ని తిరిగి పొందుకుంది.

అన్యురాలైనప్పటికి దేవుడు కోరే అంతరంగ స్వభా వాన్ని కలిగి, వివేకముతో దేవున్ని వెదకింది. ఆయనపై విశ్వాసముంచింది. తన కుటుంబ సంతోషాన్ని తిరిగి పొందుకోవడమే కాక పరిశుద్ధ గ్రంథంలో స్థానం సంపాదించింది.

**పరిశుద్ధగ్రంథ పరిశోధన పట్టిక -15 జవాబు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 నె | | 2 నే | | 3 మ | | 4 దే | | 5 క |
| 6 కో | 7 సె | డు | | హే | | 8 వా | 9 రి | తో |
| | రూ | | 10 తా | రు | మా | | మ | |
| 11 మో | యా | 12 బు | | షా | | 13 పా | ద | 14 ము |
| సే | | కో | 15 కో | లా | యా | రా | | లే |
| 16 రు | 17 యీ | యా | | ల్ | | 18 ను | 19 రో | షా |
| | లో | | 20 అ | హా | బు | | గ | |
| 21 మ్మా | ఎ | 22 యు | | ష్ | | 23 పా | ము | 24 ల |
| అ | | క్తి | | బ | | పు | | హ్మీ |

**పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 15**
**సరైన జవాబులు పంపించిన వారు**

1. డి. మెర్సీ ఇశ్రాయేల్, నెల్లూరు
2. కె. రూత్ ఇవాంజిలిన్, హైదరాబాద్
3. వి. రత్నమ్మ, హైదరాబాద్
4. యం. ప్రేమలీల, బద్వేల్
5. వై. కోటేశ్వరరావు, మార్టూరు
6. బి. ఎస్తేరు, గుంటూరు
7. పి. శాంతాగ్రేస్, మచిలీపట్నం
8. బి. సువార్తరాజు, బెంగుళూరు

చిన్నపిల్లల పేజి

# బహుమానము

డల్‌గా ఒక మూలను మౌనంగా కూర్చున్న బ్లెస్సీని చూసి, "ఏమైంది తల్లి, ఎందుకు డల్‌గా ఉన్నావు" అడిగింది తల్లి ప్రేమగా. కానీ బ్లెస్సీ ఎటువంటి సమాధానమివ్వలేదు. "ఇది పండుగ సమయం కదా అందరూ సంతోషంగా ఉంటే నువ్వెందుకు డల్‌గా ఉన్నావు?" అన్నది తల్లి

"పండుగ సమయం కాబట్టే" చిన్నగా గొణిగింది బ్లెస్సి. తల్లికి విషయం అర్థమైంది. బ్లెస్సిని ప్రేమగా దగ్గరకు తీసుకొని "నీ రూమ్‌ను మిని, మైఖెల్‌తో షేర్ చేసుకోవడం నీకు ఇష్టం లేదా? వాళ్ళు నీతో పాటు వారే కదా, చక్కగా వారితో కొత్త కొత్త ఆటలు ఆడుకోవచ్చు, సరదగా సమయం గడపవచ్చు కదా" అన్నది.

"మిని, మైఖెల్ నన్ను వారి ఆటవస్తువులు తాకనివ్వరు మమ్మీ. వాళ్ళు ధనవంతులని, మనం పేదవారమని చులకన. అయిన అంత ధనవంతులై ఉండి ప్రతి క్రిస్మస్‌కి మన ఇంటికి వస్తారెందుకు? నువ్వేమో వారితో నా రూమ్‌ను షేర్ చేయమంటావ్" అన్నది కాస్త కోపంగా.

"డానీ అంకుల్, కేరీ ఆంటీ వాళ్ళు వ్యాపారం నిమిత్తం ఇంటికి దూరంగా ఉంటూ పిల్లలను హాస్టల్‌లో చదివిస్తున్నా రని నీకు తెలుసు కదా. ఎప్పుడో ఏడాదికి ఒక్కసారి ఇంటికి వస్తారు. ఈ కొన్ని రోజులు కొంచెం సర్దుకోలేవా?" అన్నది తల్లి.

"వాళ్ళు మనలను చులకన చేసి ఏదో ఒకటి అంటారు. నేను తిరిగి అంటే గొడవ అవుతుంది. నువ్వేమో వాళ్ళనే సమర్థించి మాట్లాడతావు. అందుకే వాళ్ళు రావడం నాకు నచ్చదు. నాకు పింక్ కలర్ బార్బీ డ్రస్ కొనివ్వమంటే డబ్బులు లేవు అంటావు వాళ్ళు రాగానే వాళ్ళు అడిగినవన్నీ కొనిస్తావు నిజం చెప్పాలంటే నీకు వాళ్ళంటేనే ఇష్టమని నాకు తెలుసు" అన్నది బ్లెస్సి బుంగమూతి పెట్టుకుని.

తల్లి మనస్సులో నొచ్చుకొని, కాస్త సమయం తీసుకొని "బ్లెస్సి నీకు క్రిస్మస్ కథ చెప్పనా?" అన్నది టాపిక్ మారుస్తూ.

బ్లెస్సి చాలా నిరాశగా "నాకు క్రిస్మస్ కథ తెలుసు మమ్మీ. నువ్వేమి చెప్పదలచావో నాకు అర్థమైంది మిని, మైఖెల్ వాళ్ళు వస్తున్నారు వాళ్ళు నా రూమ్‌లో ఉంటారు అంతేగా" అన్నది.

"కాదు" అన్నది తల్లి.

"మరి..? అంటే ఈ క్రిస్మస్‌కి వాళ్ళు రావడం లేదా? హిప్ హిప్ హుర్రే" అంది బ్లెస్సి సంతోషంగా.

"ఈ సారి మిని, మైఖెల్ మాత్రమే కాక, వాళ్ళ స్నేహితులు బంధువులు, రోజి ఆంటీ, వారి పిల్లలు, నాగాలాండ్ తాతయ్య ఇంకా అందరూ మన ఇంటికే వస్తున్నారు" అన్నది తల్లి.

బ్లెస్సి సంతోషం అంతా ఒక్క సెకనులో ఆవిరైపోయి "ఇద్దరు సరిపోరని ఇంతమంది వస్తున్నారా ఇక ఈ క్రిస్మస్ జీవితాంతం గుర్తుంటుంది" అని చిన్నగా గొణిగి ప్రక్కకు వెళ్ళి దిగాలుగా కూర్చుంది.

తల్లి బ్లెస్సి దగ్గరకు వెళ్ళి "బ్లెస్సి నీకొక విషయం చెప్పనా, ప్రతి ఒక్కరి జీవితలలో అన్నిటికంటే సంతోషకరమైన రోజు క్రిస్మస్ ఎందుకంటే ఆ రోజు యేసయ్య మన....."

"యేసయ్య మన కొరకు పశువులపాకలో పుట్టాడు. కాబట్టి మనం సంతోషించవలసిన సుదినం అంతేగా. ఇది నాకు తెలుసు మమ్మీ, సండేస్కూల్‌లో చెప్పారు" అంది బ్లెస్సి తల్లి మాటలకు అడ్డుతగులుతూ.

"కేవలం అంతేకాదు... యేసయ్య దేవుడై ఉండి నీ కొరకు, దేవునిలా కాక పేదవానిలా పశువుల పాకలో పుట్టాడు. పరలోకంలో యేసయ్యకు మంచి ఇల్లు, సింహాసనం, అన్ని రకాల సౌకర్యాలు, ఇంకా ఎంతో మంది పరిచారం చేసే దేవదూతలు ఉన్నారు. యేసయ్య అవన్ని వదులుకొని మన కొరకు మనలా, మామూలు మనిషిలా పుట్టాడు కదా? ఎందుకంటావ్?" అడిగింది తల్లి.

తల వంచుకొని మౌనంగా ఉన్న బ్లెస్సి గడ్డం పట్టుకొని

పైకెత్తుతూ, "నీవే ఒక ధనవంతురాలై నీ కారు బంగ్లా అన్ని వదిలేసి పూరిపాకలో ఉండమంటే ఉంటావా?" అడిగింది తల్లి.

"ఊ...హు..." తల అడ్డంగా ఊపింది బ్లెస్సి.

''మరి యేసయ్య ఎంతో సంతోషంగా అవన్నీ వదులుకొని భూమ్మీదకు వచ్చి కష్టపడి జీవించింది నీకు పరలోకం ఇవ్వడం కోసం. పుచ్చుకొనుట కంటే ఇచ్చుట ధన్యము అని యేసయ్య చెప్పాడు (అపొ.కా.20:35). మరి నీవు మినికి మైఖెల్‌కు నీ రూమ్ షేర్ చేయడానికి, నీ ఆట వస్తువులు ఇవ్వడానికి ఎందుకు ఇష్టపడడం లేదు చెప్పు?" అన్నది తల్లి.

"మిని, మైఖెల్ ప్రవర్తన నాకు నచ్చదు. వారికి ఏదైనా ఇవ్వాలి అంటే నాకు కోపం బాధ కలుగుతున్నాయి మరి నేనేం చేయాలి?" అన్నది బ్లెస్సి కాస్త చిరాకుగా.

"యేసయ్య నీకు పరలోకం ఇవ్వడం కోసం అన్నీ వదులుకున్నాడు కదా మరి నీవు యేసయ్య చెప్పినట్లు చేయడం కొరకు నీకు కలిగే బాధను చిరాకును కోపాన్ని సహించుకొని వారికి సంతోషాన్ని ఇవ్వు. అప్పుడు నువ్వు కూడా యేసయ్య వలె దేవునికి ఇష్టమైన బిడ్డవు అవుతావు" అన్నది తల్లి. తలవంచుకొని మౌనంగా ఉంది బ్లెస్సి.

"చూడు బ్లెస్సి ఇచ్చుట శ్రేష్టమని యేసయ్య చేసి చూపించాడు. అలా చేసేటప్పుడు మనకు కొంత బాధ కలిగిన మనం సంతోషంగా ఇవ్వడం నేర్చుకోవాలి. కాస్త ఇబ్బంది అనిపించినా కోపం వచ్చినా యేసయ్యతో నీ బాధనంతా చెప్పేసెయ్. ఇక యేసయ్య చూసుకుంటాడు. కాబట్టి నీవు గొడవలు పెట్టుకోక సంతోషంగా ఉండాలి. నేను చెప్పినట్లు చేసి చూడు బ్లెస్సి ఇది నీ జీవితంలో బెస్ట్ క్రిస్మస్ అవుతుంది" అని చెప్పి తల్లి వెళ్ళిపోయింది.

బ్లెస్సి రెండు నిమిషాలు ఆలోచించి మోకరించి "ప్రభువా నేను ఈ క్రిస్మస్‌ను సంతోషంగా జరుపుకోవాలనుకుంటున్నాను. నాకు సహాయం చేయి" అని ప్రార్థన చేసుకుంది.

బంధువులతో ఇళ్ళంతా సందడి సందడిగా ఉంది. బ్లెస్సి సంతోషంగా తన రూమ్‌ను ఇతరులతో పంచుకుంది. ముందు కాస్త ఇబ్బందిగా అనిపించినా గొడవలు పెట్టుకోక మౌనంగా ఉండటం నేర్చుకుంది. బ్లెస్సిలోని ఈ మార్పును గమనించిన తల్లి ఎంతో సంతోషించింది.

చివరికి క్రిస్మస్ గిఫ్ట్ తీసుకునే సమయం వచ్చింది. పిల్లలందరూ పరుగెత్తి క్రిస్మస్ ట్రీ వద్ద పెట్టి ఉన్న బహుమతులను తీసుకుంటున్నారు. బ్లెస్సి అందరూ తీసుకున్న తరువాత చివరిగా ఉన్న గిఫ్ట్‌బాక్సును తీసుకోబోయింది ఇంతలో మిని వచ్చి ఆ గిఫ్ట్ బాక్సు తనది అని లాక్కుంది. బ్లెస్సికి ముందు కోపం వచ్చినా పోనిలే అని మినికి గిఫ్ట్ బాక్సు ఇచ్చి వెను తిరిగి చూస్తే ఇక అక్కడ గిఫ్ట్ లేవు. అందరి దగ్గర గిఫ్ట్ ఉన్నాయి తనకు మాత్రమే బహుమానం లేకపోవడంతో ఏడుస్తూ తన రూమ్‌కి వెళ్ళిపోయింది బ్లెస్సి.

కొంత సమయం తరువాత హాల్‌లోకి సంతోషంగా వచ్చిన బ్లెస్సిని చూసి ఆమె తల్లితో సహా అందరూ ఆశ్చర్యపోయారు. తాతయ్య బ్లెస్సిని దగ్గరకు తీసుకొని "అందరి దగ్గర క్రిస్మస్ బహుమానాలున్నాయి, నీకు తప్ప. మరి నీకు బాధగా లేదా?" అని అడిగాడు.


"బాధగా ఉంది" అంది చిరునవ్వు నవ్వుతూ.

బ్లెస్సి ముఖం చూసిన ప్రతి ఒక్కరి నయనాలు కన్నీటితో నిండాయి. అప్పుడు తాత మినిని పిలిచి మందలించి మిని రెండవసారి తీసుకున్న గిఫ్ట్ బాక్సును బ్లెస్సికి ఇప్పించాడు. అయితే బ్లెస్సి ఆ గిఫ్ట్ బాక్సును తీసుకోక "నేను మినికి నా గిఫ్ట్‌ను సంతోషంగా ఇచ్చివేస్తున్నాను. యేసయ్య నా నుండి కోరేది ఇదే" అన్నది మెరిసే కళ్ళతో.

అందరూ చప్పట్లు కొట్టి బ్లెస్సిని మెచ్చుకున్నారు. తాతయ్య తన బ్యాగ్‌లో నుండి ఒక బాక్సు తీసి బ్లెస్సికి ఇచ్చాడు. బ్లెస్సి కళ్ళు ఆనందంతో మెరిశాయి. సంతోషంతో బాక్సు తీసి చూసింది. బ్లెస్సి ఆనందానికి హద్దులు లేవు. అది తను ఎప్పటి నుండో కావాలనుకుంటున్న పింక్ బార్బి డ్రస్.

బ్లెస్సి తాతయ్యను చుట్టుకొని "ఇది నా బెస్ట్‌క్రిస్మస్ గిఫ్ట్ తాతయ్య అంది. నిజానికి నీవే యేసయ్యకు ఒక మంచి బహుమానము" అన్నాడు తాతయ్య నవ్వుతూ.

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక -16



**అడ్డం:**

1. తిరగబడిన దమస్కులో నివశించు ప్రజలు (5) (2కొరింథి.)
6. ఆకాశము క్రింద ప్రతి -----నకు సమయము కలదు (4) (తారుమారు) (ప్రసంగి)
7. మోయాబు మీద నేను అగ్ని వేసెదను, అది ----(4) నగరులను దహించివేయును. (కు.నుం.ఎ) (ఆమోసు)
10. అనాతోతులో నివసించు వ్యక్తి (6) (గుడి దీర్ఘం హ్రస్వంగా మారింది) (యిర్మీయా)
14. ఐగుప్తులోని సోయను కంటే ఏడు సం॥లు ముందుగా కట్టబడిన పట్టణము తిరగబడింది(3) (సంఖ్యా)
15. తారుమారైన బయానా కుమారుడు (3) (2సమూ)
18. రాజైన అహష్వేరోషు ఎదుట ఉపచారము చేయు షండుడు (3) (ఎస్తేరు) (తిరగబడ్డాడు)
19. ఆదాము భార్య (2) (ఆది)
20. యేసును శోధించినది (4) (తిరగబడింది) (మత్తయి)
21. తన చెడ్డ ధననిధిలో నుండి దుర్విషయములను తెచ్చువాడు (4) (మత్తయి)

**నిలువు:**

2. యూదా, షిమ్యోను గోత్రికుల ద్వారా అహరోను వంశీయులకు ఇవ్వబడిన పట్టణాలలో ఒకటి (యెహో)(2)
3. తలక్రిందులైన రక్తభూమి (4) (అపో.కా)
4. అహంకారుల -----ను మాన్పించెదను (5) (యెషయా) (తలక్రిందులైంది)
5. తలక్రిందులైన నకలు (2) (ఎస్తేరు)
8. హూరీ అను వానికి పుట్టిన అబీహాయిలు కుమారులలో ఒకడు (2) (1దిన)
9. ఆయన గద్దింపునకు ప్రవాహముల --- భాగములు కనబడెను (3) (2 సమూ)
11. అహరోను కుమారుడు (3) (నిర్గమ)
12. ఎలీషా చెప్పినట్లు నయమాను -----(5)లో ఏడుమార్లు మునిగెను. (తారుమారు) (2రాజులు)
13. లుస్త్రలో ప్రజలు బర్నబాకు, పౌలుకు లుకయోనియ భాషలో పెట్టిన పేర్లు తలక్రిందులైనవి (5)(అపో.కా.)
16. బవ్వై ఎవరి కుమారుడు (4) (నెహెమ్యా)
17. మోషే అన్న (4) (నిర్గమ.)